www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

: 99484 33277 / 9014966169

Published from: Karimnagar, Rangareddy, Hyderabad Circulated to: Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | కరీంనగర్ | సంపుటి 03 | సంచిక: 288 | మంగళవారం | 16 జూన్, 2026

## కేసీఆర్ కనుసన్నల్లో కిషన్‌రెడ్డి



**ఆయన కారణంగానే మెట్రో ఫేజ్-2 ఆగింది**

- ఎల్అండ్‌టీకి రుణ బదిలీ జరగకుండా అడ్డుకుంటున్నారు
- అహ్మదాబాద్, విశాఖ మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు
- హైదరాబాద్‌పై కొనసాగుతున్న వివక్ష ప్రధాని హామీలపై సమాధానం చెప్పాలి
- మోదీ రాజీనామా చేస్తే నాతో పాటు మంత్రివర్గాన్ని రద్దు చేస్తా: సీఎం రేవంత్

ప్రజానావ, హైదరాబాద్:

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచనల మేరకే వ్యవహరిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సహకరించినందుకు ఇప్పుడు గురుదక్షిణ చెల్లిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్, బీఆర్ఎస్ కుట్రలకు సహకరిస్తూ హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు ఇద్దరు కలిసి అడ్డంకులు సృష్టిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కిషన్‌రెడ్డి కారణంగానే మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని విమర్శించారు. సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, మెట్రో విస్తరణ జరిగే ప్రాంతాల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారని, రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మెట్రో విస్తరణకు దాదాపు రూ.40వేల కోట్లు అవసరమవుతాయని, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును అమలు చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. నిధులివ్వకపోయినా, కనీసం ఎన్‌వోసీ మంజూరు చేయాలని కోరినా కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. ఎల్అండ్‌టీకి ఐఆర్ఎఫ్‌సీ ద్వారా అందాల్సిన రుణ బదిలీని కూడా కిషన్ రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. అహ్మదాబాద్, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు, నిధులు తరువాయి 2లో

## ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి

- క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- విధులు నిర్వర్తించని అధికారులపై చర్యలు
- 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన కొన్ని కార్యక్రమాలకు ఆశించిన స్థాయిలో ప్రచారం లభించలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలను మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఇందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల స్థాయిలో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను నమోదు చేసి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మార్చి 16 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలపై నివేదికలు సమర్పించగా, యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న శాఖలను సీఎం అభినందించారు. ప్రధాన కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ల వరకు అన్ని స్థాయిల అధికారులు ప్రతి నెలా క్షేత్రస్థాయిలో పర్యటించాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసిన సీఎం, వాటిని పాటించని అధికారులపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ తరువాయి 2లో




## ఏడేళ్లలో ఫ్యూచర్ సిటీ

- 765 చదరపు కి.మీ. విస్తీర్ణానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక
- గ్లోబల్ టెండర్లలో లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచిన డీపీ ఆర్కిటెక్ట్స్
- తొలిదశలో 30వేల ఎకరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### సింగపూర్ సంస్థకు మాస్టర్ ప్లాన్ బాధ్యతలు

తొమ్మిది నెలల్లో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయనున్న సంస్థ

లైఫ్‌సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏఐ, డేటా సెంటర్లకు అధిక ప్రాధాన్యం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రాజెక్టు వేగం పుంజుకుంటోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయాన్ని ప్రారంభించిన నేపథ్యంలో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియ కూడా కీలక దశకు చేరుకుంది. రానున్న ఆరు, ఏడేళ్లలో ప్రపంచస్థాయి మౌలిక వసతులతో కూడిన ఆధునిక నగరాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇదే క్రమంలో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ డీపీ ఆర్కిటెక్ట్స్‌కు అప్పగించినట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం నిర్వహించిన గ్లోబల్ టెండర్లలో ఆరు అంతర్జాతీయ సంస్థలు పాల్గొనగా, డీపీ ఆర్కిటెక్ట్స్ లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచినట్లు సమాచారం. మొత్తం 765 చ.కి.మీ. తరువాయి 2లో



### అమెరికా-ఇరాన్

## శాంతి ఒప్పందం

- పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర.. ప్రపంచ దేశాల హర్షం
- ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్:** నెలల తరబడి ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరపడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ వారం చివర్లో ఇరు దేశాలు అధికారికంగా ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు సమాచారం. మూడు నెలలకు పైగా కొనసాగిన ఘర్షణలకు ముగింపు పలికే ఈ పరిణామాన్ని భారత్ సహా ప్రపంచ దేశాలు స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వం పునరుద్ధరణతో పాటు వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం, అంతర్జాతీయ వాణిజ్యానికి ఊరటనివ్వడం వంటి అంశాల్లో ఈ ఒప్పందం కీలక మలుపుగా తరువాయి 2లో

### శాంతి, స్థిరత్వం పునరుద్ధరించాలి

- అమెరికా-ఇరాన్ ఒప్పందంపై ఎక్స్ వేదికగా స్పందించిన మోదీ
- స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్న భారత ప్రధాని

06

## సింగరేణిని ప్రైవేట్ పరంచేసే కుట్ర

### ఓపెన్ కాస్ట్ విస్తరణతో సంస్థకు నష్టం

- సింగరేణి బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం
- బొగ్గుబాయి బాట కార్యక్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత




**ప్రజానావ, మంచిర్యాల:** సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. అండర్‌గ్రౌండ్ మైనింగ్‌ను నిర్లక్ష్యం చేస్తూ ఓపెన్ కాస్ట్ గనుల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సింగరేణి ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.50వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన 'బొగ్గుబాయి బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం కాసిపేట మైన్-1ను కవిత సందర్శించారు. గనిలోకి వెళ్లి కార్మికులతో నేరుగా మాట్లాడిన ఆమె, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కాసిపేట నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత మాట్లాడుతూ, కొత్త బొగ్గు గనులను అభివృద్ధి చేస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్మికుల వారసత్వ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. సింగరేణి పరిరక్షణ కోసమే టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. అండర్‌గ్రౌండ్ గనులను కాపాడుకునేందుకు హెచ్ఎంఎస్‌తో కలిసి రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ కార్మికుల సమస్యలపై తాము కలిసి పని చేశామని గుర్తు చేశారు. గతంలో మెడికల్ బోర్డు ఏర్పాటు కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర తమదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం సాధారణంగా పరిష్కారం కావాల్సిన సమస్యల కోసం కూడా కార్మికులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన తరువాయి 2లో




## మళ్లీ నిఫా కలకలం

- కోజికోడ్‌లో 43ఏళ్ల వ్యక్తికి వైరస్ నిర్ధారణ
- అప్రమత్తమైన కేరళ.. హై అలర్ట్ ప్రకటించిన తమిళనాడు

06

## ఎనిమిది వరి రకాల సాగుకు ప్రోత్సాహం

- విదేశాల్లో మన బియ్యానికి భారీ డిమాండ్
- మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంట ప్రణాళిక రూపొందించాలి
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

02

## అప్రమత్తంగా ఉండాలి

### 19 నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం

- వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరం
- విపత్తు నిర్వహణ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలి
- ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ లక్ష్యం: పొంగులేటి



ప్రజానావ, హైదరాబాద్:

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19 నుం చి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్ర మత్తంగా ఉండాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వర్షాకాలం ముగిసేవరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉ న్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిస్థితులపై నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వహణ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వర్షాకాలం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను నిరంతరం సమీక్షించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు.




### ప్రభుత్వ పాఠశాలల్లో

## బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్

- రూ.800 కోట్లతో ప్రతిష్టాత్మక పథకానికి శ్రీకారం చుట్టిన సర్కార్
- రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇకనుంచి వారంలో ఆరు రోజులు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు రాగి జావా

03

## సినిమా అవకాశాల పేరుతో నటికి వేధింపులు

- పారితోషికం చెల్లించకుండా మోసం చేశాడంటూ ఆరోపణ
- క్యాస్టింగ్ ఆర్టిస్ట్ ప్రసాద్‌పై కేసు నమోదు

**ప్రజానావ, హైదరాబాద్:** సినిమా అవకాశాల పేరుతో ఓ నటిని వేధించడంతో పాటు ఆమెకు చెల్లించాల్సిన పారితోషికం, ప్రయాణ ఖర్చులు ఇవ్వకుండా మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న క్యాస్టింగ్ ఆర్టిస్ట్ ప్రసాద్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటించినందుకు బాధితురాలికి రూ.90 వేల పారితోషికంతో పాటు రూ.38 వేల ప్రయాణ ఖర్చులు చెల్లించాల్సి ఉండగా, నిందితుడు వాటిని ఇవ్వకుండా కాలయాపన చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంజారాహిల్స్‌కు పిలిపించిన నిందితుడు, బకాయిలు చెల్లించకుండా బెదిరించడమే కాకుండా, బలవంతంగా కారులో ఎక్కించుకొని మరిన్ని సినిమా అవకాశాలు కల్పిస్తానంటూ అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అక్కడి నుంచి బయటపడిన బాధితురాలు జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పగా, ఆమె ఫోన్‌లో నిందితుడిని నిలదీసినట్లు సమాచారం. ఈ క్రమంలో బాధితురాలి తల్లిని కూడా దుర్భాషలాడి బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఎనిమిది వరి రకాల సాగుకు ప్రోత్సాహం

- విదేశాల్లో మన బియ్యానికి భారీ డిమాండ్
- మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంట ప్రణాళిక రూపొందించాలి
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎగుమతులకు అనువైన ఎనిమిది రకాల వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విదేశీ మార్కెట్లలో తెలంగాణ బియ్యానికి మంచి డిమాండ్ ఉందని, రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే మద్దతు ధర కంటే అధిక ధర పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ సోనా మసూరి సహా ఎగుమతులకు అనువైన వరి రకాల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, ఎగుమతి అవకాశాలు ఉన్న వరి రకాల సాగుపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ నిపుణులు కేబినెట్ సబ్ కమిటీకి కీలక సూచనలు చేశారని, ఎంపిక చేసిన ఎనిమిది రకాల వంగడాల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని వివరించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ పొందుతున్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే పంటల సాగును ప్రోత్సహించేందుకు గ్రామస్థాయిలో చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు.

### డిమాండ్ లేని రకాలను తగ్గించాలి

మార్కెట్ ఆధారిత వ్యవసాయంపై రైతులకు మార్గనిర్దేశం చేయడంతో పాటు, డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వంగడాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనువైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వానాకాలం సాగుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు నష్టం కలగకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంట ప్రణాళిక రూపొందించాలని, నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వరి వంగడాలకు ప్రత్యేక ప్రోత్సాహకాల అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణను అధిక నాణ్యత కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. రైతుల ఆదాయం పెంపుతో పాటు మార్కెట్‌తో అనుసంధానించే ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని, మెరుగైన ధరలు లభించేలా డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కీలక అడుగు

- తరుణి సంస్థతో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఒప్పందం
- 'బాల్య వివాహం - బతుకు ఆగం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- సమాజమంతా కలిసి ముందుకొస్తేనే శాశ్వత పరిష్కారం
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ, తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. మంత్రి సీతక్క సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'బాల్య వివాహం - బతుకు ఆగం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు, మైనర్ బాలికల గర్భధారణలను నివారించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, బాల్య వివాహాల గుర్తింపు, నివారణ, చట్టపరమైన చర్యలపై అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామని వెల్లడించారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, ప్రచార సామగ్రి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడతామని తెలిపారు. బాలికల విద్య కొనసాగింపు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, స్వయం సాధికారత అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీతక్క పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజమంతా కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలిక తన విద్యను పూర్తి చేసుకుని, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవాలంటే బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో బాల్య వివాహాల నివారణకు మరింత బలోపేతమైన వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణను కించపరిచేలా పవన్ వ్యాఖ్యలు

- బీజేపీ స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత ఆయనకు లేదు
- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆగ్రహం



**ప్రజానావ, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదేపదే తెలంగాణను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడేందుకు ఇది సినిమా కాదని హితవు పలికారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రం, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై స్పందించిన మహేష్‌కుమార్ గౌడ్, ఆయన స్వతంత్రంగా మాట్లాడడం లేదని, ప్రధాని నరేంద్రమోదీతో పాటు బీజేపీ నేతలు ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మగా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ మాట్లాడటం పవన్ కళ్యాణ్‌కు కొత్తేమీ కాదని, గతంలోనూ బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించే ప్రయత్నాలు చేశారని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించిన మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్‌ను విమర్శించడం సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులభం కాదన్నారు. నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను ముందుగా తెలుసుకోవాలని సూచించారు. దేశ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, నేడు ఆ విజయాలను బీజేపీ సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు.

### ఆ విషయాన్ని మరవొద్దు

పవన్ కళ్యాణ్ సినీ హీరోగా ఎదగడంలో తెలంగాణ ప్రేక్షకుల పాత్ర ఎంతో ఉందని, ఆ విషయాన్ని ఆయన మరువరాదన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా అక్కడ చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత పవన్ కళ్యాణ్‌కు లేదని, అధికారం ఉందనే కారణంతో తెలంగాణ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, అయితే తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఆంధ్రప్రదేశ్ కూడా ఆదర్శంగా తీసుకునే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, జనసేన మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.

## ప్రాణాలు తీసిన ఫొటోషూట్

- చెరువులో మునిగి ముగ్గురు యువకుల మృతి
- కీసర మండలంలో ఘటన

**ప్రజానావ, మేడ్చల్:** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్ కోసం ఫొటోలు, వీడియోలు చిత్రీకరించేందుకు వెళ్లిన ముగ్గురు యువకులు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామంలోని బాణమ్మ చెరువు వద్దకు ఆంటోనీ (18), జోసెఫ్ (18), టోనీ (17) అనే ముగ్గురు స్నేహితులు ఫొటోషూట్ కోసం వెళ్లారు. ఈ సందర్భంగా నీటిలో పడిపోయిన హెడ్‌ఫోన్లను తీసుకురావడానికి చెరువులోకి దిగిన వారు ప్రమాదవశాత్తు లోతైన నీటిలో చిక్కుకుని మునిగిపోయారు. మృతులంతా బొల్లారం ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇద్దరు యువకుల మృతదేహాలను వెలికితీయగా, అనంతరం మూడో యువకుడి మృతదేహాన్ని కూడా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరదాగా వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు, ఫొటోషూట్లు, వీడియోల కోసం సాహసాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ జిల్లా పోలీసులు యువతకు సూచించారు.

## కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్‌పై దాడి

- నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన
- అభిజిత్ దీప్కేను చెంపదెబ్బ కొట్టిన గుర్తుతెలియని వ్యక్తి
- దుండగుడిపై ఎదురు దాడి చేసిన పార్టీ కార్యకర్తలు

**జైపూర్:** నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ధర్నాలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేయడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో అభిజిత్ దీప్కే ప్రసంగిస్తుండగా, ఓ వ్యక్తి ఆకస్మికంగా ఆయన వద్దకు చేరుకుని చెంపపై కొట్టాడు. దీంతో ఆగ్రహానికి గురైన కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు దుండగుడిపై ఎదురు దాడికి దిగారు. తనపై దాడి చేసిన వ్యక్తిని కొట్టవద్దని అభిజిత్ దీప్కే కోరినప్పటికీ, కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అభిజిత్ దీప్కేను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై భౌతిక దాడులు చేయడాన్ని నెటిజన్లు ఖండిస్తున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. కాగా, నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్‌సీ తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. ఇందులో భాగంగానే జైపూర్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఈ ఘటన చోటుచేసుకుంది.

## మూడేళ్ల చిన్నారిపై కోతుల దాడి

### ఇంటి ముందు ఆడుకుంటుండగా ఘటన

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో కోతులు బీభత్సం సృష్టించాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారి అన్విక‌పై సోమవారం కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి ఇంటిఎదుట ఆడు కుంటుండగా అకస్మాత్తుగా కోతులు దాడి చేశా యి. ఆమె ఏడుపు విని అక్కడికి చేరుకున్న తల్లి కోతులను తరిమికొట్టడంతో మరింత ప్రమాదం తప్పింది. అయితే దాడిలో చిన్నారికి తీవ్ర గాయా లు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోతుల సమస్యపై అటవీ, సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## తిరువళ్లూరులో విషాదం

- లైంగిక దాడికి గురైన చిన్నారి మృతి
- నిందితుడిపై కేసు నమోదు

**చెన్నై:** తమిళనాడులోని తిరువళ్లూర్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. లైంగిక దాడికి గురైన మూడేళ్ల చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరువళ్లూర్ సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో నివసిస్తున్న బిహార్‌కు చెందిన ఓ వలస కార్మికుడిని ఈ కేసులో అరెస్టు చేశారు. చిన్నారికి నిందితుడు ముందే పరిచయం ఉండటంతో బిస్కెట్లు ఇస్తానని ఆశ చూపి తన వెంట తీసుకెళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం తీవ్ర గాయాలతో బాలిక ఓ పొద సమీపంలో కనిపించడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న స్థానికులు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయం ఉందన్న అనుమానంతో కొందరిపై దాడికి కూడా పాల్పడ్డారు. అయితే, చిన్నారిపై సామూహిక అత్యాచారం జరగలేదని, ఒక్క వ్యక్తి మాత్రమే ఈ నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, చిన్నారి మృతితో హత్య అభియోగాలను కూడా చేర్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్రంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవలి కాలంలో బాలికలపై దాడుల ఘటనలు పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. పోలీసులు కేసును అత్యంత ప్రాధాన్యంతో దర్యాప్తు చేస్తున్నారు.

## ఏడేళ్లలో ఫ్యూచర్ సిటీ

(మొదటిపేజీ తరువాయి)

లోమీటర్ల విస్తీర్ణానికి సంబంధించిన సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించే బాధ్యతలను సంస్థకు అప్పగించినట్లు తెలుస్తోంది. తొమ్మిది నెలల వ్యవధిలో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో తొలి దశలో 30 వేల ఎకరాల విస్తీర్ణానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. భూ వినియోగం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలు వంటి అంశాలను ఇందులో పొందుపరచనున్నారు. ఈ 30 వేల ఎకరాల్లో సుమారు 13 వేల ఎకరాలను మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి అవసరాలకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో లైఫ్‌సైన్సెస్ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందుకోసం దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ప్రత్యేక లైఫ్‌సైన్సెస్ హబ్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా 2,177 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌ను అభివృద్ధి చేయనున్నారు.

### ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ పార్క్‌కు ప్రత్యేక స్థానం

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ రంగానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ పార్క్‌ల అభివృద్ధి కోసం దాదాపు రెండు వేల ఎకరాలను కేటాయించినట్లు తెలుస్తోంది. అత్యాధునిక సాంకేతిక రంగాల అభివృద్ధికి అనుగుణంగా ప్రత్యేక ఏఐ సిటీ కోసం 400 ఎకరాలను, డేటా సెంటర్ హబ్ కోసం 310 ఎకరాలను కేటాయించనున్నట్లు సమాచారం. అలాగే హెల్త్ సిటీ కోసం 594 ఎకరాలు, విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల సముదాయం ఏర్పాటుకు 255 ఎకరాలను కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

### నివాస ప్రాంతాల అభివృద్ధికి 2,477 ఎకరాలు

నివాస సముదాయాల అభివృద్ధి కోసం 2,477 ఎకరాలను కేటాయించగా, మిక్స్‌డ్ యూజ్ జోన్లలో వినోదం, క్రీడలు, ఫర్నిచర్ తయారీ పరిశ్రమలు తదితర అవసరాలకు కూడా ప్రత్యేక స్థలాలను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌లో రవాణా కారిడార్లు, యుటిలిటీ నెట్‌వర్క్‌లు, సామాజిక మౌలిక వసతులు, వాణిజ్య ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ జోన్లు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

### వివిధ ప్రాంతాల సమన్వయంతో అభివృద్ధి

ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని ప్రాంతాలు వివిధ పరిపాలనా హద్దుల్లో ఉన్నాయి. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా, మధ్య భాగంలో హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రాంతం ఉంది. దక్షిణ భాగంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాల సమన్వయంతో సమగ్ర నగరాభివృద్ధి ప్రణాళికను రూపొందించి, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

## అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

నిలుస్తుందని ప్రపంచ నాయ కులు అభిప్రాయపడ్డారు. ఈ శాంతి ప్రక్రియ లో పాకిస్థాన్ ప్రధాన మధ్యవర్తిగా వ్యవహరిం చగా, ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జ ర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాలు కూడా కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రం ప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ ఒప్పందం కుదిరిన విషయాన్ని ప్రకటించారు. ''ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది. అందరికీ అభినందనలు. ప్రపంచ నౌకలారా.. మీ ఇంజిన్లను ప్రారంభించండి. చము రు సరఫ రాలు తిరిగి పునరుద్ధరించండి'' అంటూ ఆయ న స్పందించారు. ఇదిలాఉంటే అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం పశ్చిమాసియా రాజకీయాల్లోనే కాకుండా ప్రపంచ ఆర్థిక, భద్రతా రంగాల్లోనూ కీలక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### శాంతి ప్రయత్నాలకు భారత్ మద్దతు

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఈ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన రవాణా నిరాటంకంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి దోహదపడే ప్రతి చర్యకు భారత్ మద్దతుగా నిలుస్తుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ పరిణామాలు ఉక్రెయిన్-రష్యా వివాద పరిష్కార ప్రయత్నాలకు కూడా స్ఫూర్తినివ్వాలని ఆయన ఆకాంక్షించారు.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊరట: జర్మనీ

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన దౌత్యపరమైన ఒప్పందం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి దోహదపడుతుందని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా మరింత సురక్షిత ప్రాంతంగా మారేందుకు ఈ ఒప్పందాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### హోర్ముజ్ జలసంధి తెరవాలి: మెక్రాన్

ఈ ఒప్పందాన్ని వేగంగా అమల్లోకి తీసుకురావాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సూచించారు. హోర్ముజ్ జలసంధిని ఎలాంటి ఆంక్షలు లేకుండా తెరిచి ఉంచాలని, నౌకాయాన రవాణా సాధారణ స్థితికి చేరుకోవాలని అన్నారు. అలాగే ఇరాన్ అణు కార్యక్రమం, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన అంతర్జాతీయ ఆందోళనలకు కూడా ఈ ఒప్పందం పరిష్కారం చూపాలని ఆకాంక్షించారు.

### అణ్వాయుధాల విషయంలో మార్పులేదు: స్టార్మర్

ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తమ వైఖరి యథాతథంగానే కొనసాగుతుందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం విజయవంతం కావడానికి మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు ఆయన అభినందనలు తెలిపారు.

### చట్టాల ప్రకారమే పరిష్కారాలు: ఎర్డోగాన్

పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంపై అధికారిక సంతకాలు జరిగే వరకు ఇరు పక్షాలు సంయమనం పాటించాలని సూచించారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్యపరమైన పరిష్కారాలకు టర్కీ నిరంతరం మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

## సింగరేణిని ప్రైవేట్ పరంచేసే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి ఏర్పడిందని ఆవేద న వ్యక్తం చేశారు. సింగరేణి అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్మికులను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, ఐటీ సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డుల నిర్వహణ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

### ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సింగరేణి కార్మికుల్లో అధికశాతం యువతే ఉన్నప్పటికీ, వారి పిల్లల విద్య కోసం నాణ్యమైన పాఠశాలలు, వైద్య సేవల కోసం కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు అందుబాటులో లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో ప్రైవేటీక రణ ను ప్రోత్సహిస్తూ వైద్యాన్ని ఖరీదైనదిగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల రక్షణ కోసం 'తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం' పేరుతో ఐదు కీలక అంశాలతో ముందుకు వస్తున్నట్లు కవిత ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల సాధన కోసం జేబీసీసీఐ స్థాయిలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా పోరాటం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. కొత్త పార్టీ ఆవిర్భావం తర్వా త సింగరేణి ప్రాంతంలో ఇదే తన తొలి పర్యటన అని పేర్కొన్న కవిత, కార్మికుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ తమకు ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు.

### పాఠశాల భవనాలపై సోలార్ ప్లాంట్లు

గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాల జాబితాను సిద్ధం చేసి, కొత్త భవనాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్ శాఖకు సూచించారు. అన్ని పాఠశాల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, విద్య, వైద్య శాఖల్లో ఫేషియల్ రికగ్నిషన్ ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించినట్లే జిల్లా స్థాయిలో 99 రోజుల ప్రగతి కార్యక్రమాలపై సమీక్షలు చేపట్టాలని సీఎం ఆదే శించారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజల స్పందనపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయా లని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండ లం, గ్రామాల వారీగా పథకాల లబ్ధిదారులు, అభివృద్ధి పనుల వివరాలను డ్యాష్‌బోర్డులో అందుబా టులో ఉంచాలని ఆదేశించారు. తాను ముఖ్యమం త్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా పర్యటనల్లో ఇచ్చిన హామీల అమలుపై సమీక్ష నిర్వహించిన సీఎం, నియోజకవర్గాల వారీగా వాటి పురోగతిపై నివేదికలు సమర్పించాలని ప్లా నింగ్ శాఖను ఆదేశించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేమనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కనుసన్నల్లోనే కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)



మంజూరు చేస్తూ హైదరాబాద్ విషయంలో మాత్రం వివక్ష చూపుతోందని రేవంత్‌రెడ్డి మండిప డ్డారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తు న్న వైఖరి ఈ వ్యవహారంతో స్పష్టమవు తోందన్నారు.

### నేను కూడా రాజీనామా చేస్తా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తన రాజీనామాపై చేసిన వ్యాఖ్యలకు స్పందించిన సీఎం, ప్రధాని మోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికల హామీలు అమలు చేయనందుకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ రాజీనామా చేయడానికి సిద్ధమైతే, తాను కూడా తన పదవితో పాటు మంత్రివర్గాన్ని రద్దు చేయడానికి సిద్ధంగా ఉన్నానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.




# యూట్యూబ్ చూసి నకిలీ నోట్లు తయారీ

- ఇద్దరు అరెస్ట్
- రూ.500 నకిలీ నోట్లు, ప్రింటర్, స్కానర్, బైక్ స్వాధీనం

**ప్రజానావ, నల్లగొండ :** యూట్యూబ్‌లో వీడియోలు చూసి నకిలీ కరెన్సీ నోట్ల తయారీకి పాల్పడి వాటిని చలామణి చేస్తున్న ఇద్దరిని చండూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 15 నకిలీ రూ.500 నోట్లు, ప్రింటర్, స్కానర్‌తో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి తెలిపారు. చండూరుకు చెందిన ఆవుల కిరణ్ మిల్క్ సెంటర్ వద్ద పాలు విక్రయిస్తుండగా, జూన్ 12న నిందితుడు బెజవాడ రాజీవ్ రూ.500 నోటుతో పాలు కొనుగోలు చేశాడు. అనంతరం ఆ నోటు నకిలీదని గుర్తించిన కిరణ్ చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు సీఐ టి. రాము, ఎస్ఐ జె. శివకుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. సోమవారం ఉదయం నల్గొండలోని కంచర్ల టవర్స్ ప్రాంతం లో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించ గా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆన్‌లైన్‌లో ప్రింటర్, పేపర్లు కొనుగోలు చేసి యూట్యూబ్ వీడియోల ద్వారా నకిలీ నోట్ల తయారీ నేర్చుకున్నట్లు అంగీకరించారు. నిందితుల్లో ప్రధాన నిందితుడు బెజవాడ రాజీవ్‌పై గతంలో హత్య, హత్యాయత్నం కేసులతో పాటు తెలుగు రాష్ట్రాల్లో నకిలీ నోట్ల చలామణికి సంబంధించిన ఏడు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతనిపై మిర్యాల గూడలో రౌడీషీట్ కూడా కొనసాగుతోంది. రెండో నిందితురాలు దుర్గం పావని సూర్యాపేట జిల్లాకు చెందిన గృహిణి. నిందితుల వద్ద నుంచి నకిలీ నోట్ల ముద్రణకు ఉపయోగించిన 100 బాండ్ పేపర్లు, కత్తెర, స్పార్కెల్ పెన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై చండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నంబర్ 75/2026 కింద బీఎన్ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

# మళ్లీ బడిబాట పట్టిన విద్యార్థులు

- రాష్ట్రవ్యాప్తంగా పునఃప్రారంభమైన పాఠశాలలు
- ఘనంగా స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ
- అమావాస్య ప్రభావంతో తొలి రోజు తక్కువ హాజరు
- స్కూల్ బస్సులపై ఆర్టీఏ ప్రత్యేక తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన 150కిపైగా వాహనాలపై కేసులు



**ప్రజానావ, హైదరాబాద్:** వేసవి సెలవులు ముగియడంతో సోమవారం తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితమైన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలు సందడిగా మారాయి. ఉదయం నుంచే ఆటోలు, స్కూల్ బస్సులు రోడ్లపైకి రావడంతో నగరాలు, పట్టణాల్లో సందడి నెలకొంది. తొలి రోజు పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం అందించడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కొత్త యూనిఫారాలు, పుస్తకాలతో చిన్నారులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు. అయితే పాఠశాలలు అమావాస్య రోజున ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు హాజరు శాతం తక్కువగా నమోదైంది. కొత్త పనులు, చదువులు అమావాస్య రోజున ప్రారంభించడం శుభం కాదన్న భావనతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను ఇంటి వద్దే ఉంచినట్లు తెలుస్తోంది. దీంతో చాలా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు ఆశించిన స్థాయిలో కనిపించలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కరే హాజరుకావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. తోటి విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో ఆమె ఒంటరిగానే తరగతి గదిలో కూర్చోవాల్సి వచ్చింది. మరోవైపు, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అమావాస్య నేపథ్యంలో జూన్ 17 లేదా 19 తేదీల్లో తరగతులు ప్రారంభించేం దుకు నిర్ణయం తీసుకున్నాయి.

### స్కూల్ బస్సుల తనిఖీ

పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా స్కూల్ బస్సులను పరిశీలించగా, నిబంధనలు ఉల్లంఘించిన 150కిపైగా వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేని 35 విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# రాష్ట్ర టాపర్ రశ్మితకు కలెక్టర్ అభినందనలు

- నిరంతర కృషితోనే విజయాలు సాధ్యం

**ప్రజానావ, కరీంనగర్ :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కడారి రశ్మితను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అభినందించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రశ్మితను ప్రత్యేకంగా ఆహ్వానించిన కలెక్టర్, ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ సత్కరించారు. మొత్తం 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్రంలో తొలి ర్యాంకు పొందడం విశేషమని కొనియా డారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితోనే ఇలాంటి అసాధారణ విజయాలు సాధ్యమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, అంకి తభావంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించి భవిష్య త్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని, జిల్లా ప్రతిష్ఠను పెంచాలని విద్యార్థినికి సూచించారు. ఈ విజయానికి తోడ్ప డిన తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాన్ని కూడా కలెక్టర్ అభినందించారు. విద్యార్థుల ప్రతిను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ అశ్విని తానా జీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాం త్‌రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష పాల్గొన్నారు.




# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- కేసీఆర్ నగర్‌లో ఖాళీ బిందెలతో నిరసన
- మూడు రోజులుగా అందని నీరు, కాలనీ గేటుకు తాళం వేసి మహిళల ఆందోళన

**ప్రజానావ, సిరిసిల్ల :** తాగునీటి కోసం మహిళలు రోడ్డు ఎక్కారు. సోమవారం ఖాళీ బిందెలు చేత పట్టుకొని కేసీఆర్ నగర్ కాలనీలో ఆందోళన నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని పేదలకు తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ నగర్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గత ప్రభుత్వం ఇచ్చింది. వందలాదిమంది అక్కడ నివాసం ఉంటున్నారు. గత మూడు రోజులుగా నీళ్లు రాకపోవడంతో మహిళలు ఆందోళనకు దిగారు. కాలనీ గేటుకు తాళం వేసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యతో పాటు పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలతో విసిగిపోయామని ఆవేదన వ్యక్తం చేసారు. తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ నగర్ అనే పేరు ఉన్నందుకే తమ కాలనీని నిర్లక్ష్యం చేస్తున్నారా? అంటూ నిలదీశారు. సమస్యను పరిష్కరించకుంటే గ్రామపంచాయతీ ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా మహిళలు హెచ్చరించారు.

## ప్రాజెక్టులను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణకు రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానాలు

**ప్రజానావ, సిరిసిల్ల:** ఎగువ మానేరు (నర్మాల) ప్రాజెక్టు పరిరక్షణ, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు అందరూ కలిసి పోరాడాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. సోమవారం నర్మాలలోని ప్రాజెక్టు అతిథి గృహంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 75 ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను తొలగించడం, శిథిలావస్థలో ఉన్న కాలువలకు మరమ్మత్తులు చేపట్టడం, రక్షణ గోడ నిర్మాణం చేయడం, 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయడం, 21 వేల ఎకరాల ఆయకట్టుకు కాలువ పనులను విస్తరించడం వంటి డిమాండ్లు చేశారు. అలాగే ప్రభుత్వ భూముల్లో జారీ చేసిన పట్టాలను రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకోవడం, నక్కవాగు ప్రాజెక్టును ఎగువ మానేరు ప్రాజెక్టుతో అనుసంధానం చేయడం, ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తీర్మానించారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే లక్ష్యం

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 24 ఫిర్యాదులు స్వీకరణ
- ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువకావాలి
- సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ.గితే

**ప్రజానావ, సిరిసిల్ల :** గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాల న్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుప రుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవం తంగా సేవలందించడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.

## చిన్నారులకు స్వాగతం

- బెలూన్లు, పూలు, చాక్లెట్లతో విద్యార్థులను ఆహ్వానించిన ఉపాధ్యాయులు

**ప్రజానావ, తిమ్మాపూర్ :** వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. బెలూన్లు, పూలు, చాక్లెట్లు అందజేస్తూ చిన్నారులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ప్రతి ఏడాది జూన్ 12న ప్రారంభమయ్యే పాఠశాలలు ఈసారి ఎండల తీవ్రత కారణంగా జూన్ 16న తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే అమావాస్య సందర్భంగా కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపడంలో వెనుకంజ వేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని ఉన్నత ప్రాథమిక పాఠశా లలో ఉపాధ్యాయులు వినూత్నంగా విద్యార్థులను స్వాగతించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలోని సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, పాఠశాల ఆవరణ సందడిగా మారింది.

# వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్

- 20న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- త్వరిత న్యాయం, సామరస్యపూర్వక పరిష్కారాల కోసం ప్రజలకు పోలీస్ కమిషనర్ పిలుపు




**ప్రజానావ, రామగుండం:** ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లు వివాదాలను శాంతియుతంగా, రాజీ మార్గంలో పరిష్కరించేందుకు అత్యంత సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి పంపకాలు, కుటుంబ, వైవాహిక సమస్యలు, బ్యాంకు రుణ బకాయిల వసూళ్లు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాలను లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. చిన్నచిన్న వివాదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా న్యాయవ్యవస్థ కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరగా పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది రాజీకి అనువైన కేసులను గుర్తించాలని కమిషనర్ ఆదేశించారు. సంబంధిత పక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి, పరస్పర అవగాహనతో రాజీ కుదిరేలా కృషి చేయాలని సూచించారు. తమ కేసుల్లో రాజీ కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

**లోక్ అదాలత్ ప్రత్యేకతలు**

- ఇరుపక్షాల సమ్మతితోనే రాజీ సాధ్యమవుతుంది.
- లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుంది.
- న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కార ప్రక్రియ కొనసాగుతుంది.

ప్రజలు, పోలీసు శాఖ, న్యాయస్థానాలు సమన్వయంతో పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించవచ్చని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్

**రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**ప్రజానావ, ఖైరతాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకాన్ని సోమవారం ప్రారంభించారు. హైద రాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని పథకానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థు లతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి, వారికి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వారంలో ఆరు రోజుల పాటు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు రాగి జావాను అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లను వెచ్చిస్తున్నట్లు వెల్లడించా రు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు కోరుకునే ప్రజలు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులపై కూడా విశ్వాసం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణపై కేంద్రం వివక్ష

- మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్‌లో చేర్చాలి
- శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితి పెంచాలని డిమాండ్
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజానావ, హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో రూ.4 వేల కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టిందని, జొన్నల కొనుగోలుకు కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటివరకు 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు వెల్లడించారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే ధర మద్దతు పథకం (పీఎస్ఎస్) పరిధిలోకి తీసుకు రావాలని కేంద్రాన్ని కోరారు. అలాగే శనగ, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపై అమలులో ఉన్న 25 శాతం పరిమితిని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్రం స్పందించడం లేదని విమర్శించిన మంత్రి, కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యం

**ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్**

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ పనుల పురోగతిని సోమవారం ఆయన సమీక్షించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండాపురం, భువనగిరి మండలం అనంతారం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల అమలు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగన్నగూడెంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులందరికీ గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గౌతమ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అలివేలు, ఎంపీడీవోలు, ఏఈలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జిలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169



# ప్రాంతీయ పార్టీలకు కొత్త దిశ అవసరం

EDITORIAL

ప్రాంతీయ పార్టీలకు కూడా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. కుటుంబ ఆధారిత రాజకీయాలు, వ్యక్తిపూజ, అధికార కేంద్రీకరణ, ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు వాటి విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు ప్రాంతీయ పార్టీలకు దూరమవుతున్న సంకేతాలు కనిపించడం ఇందుకు నిదర్శనం. కేవలం ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా దీర్ఘకాలం రాజకీయ మనుగడ సాధ్యం కాదు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని, సమాజంలోని అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, అభివృద్ధి రాజకీయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉంటుంది. కుటుంబాల చుట్టూ తిరిగే రాజకీయాలకు కాలం చెల్లిపోతోందన్న విషయాన్ని ఆయా పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది.

ప్రాంతీయ పార్టీలకు కూడా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. కుటుంబ ఆధారిత రాజకీయాలు, వ్యక్తిపూజ, అధికార కేంద్రీకరణ, ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు వాటి విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు ప్రాంతీయ పార్టీలకు దూరమవుతున్న సంకేతాలు కనిపించడం ఇందుకు నిదర్శనం. కేవలం ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా దీర్ఘకాలం రాజకీయ మనుగడ సాధ్యం కాదు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని, సమాజంలోని అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, అభివృద్ధి రాజకీయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉంటుంది. కుటుంబాల చుట్టూ తిరిగే రాజకీయాలకు కాలం చెల్లిపోతోందన్న విషయాన్ని ఆయా పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలకు అవసరమైంది విలీనాలు కాదు, ఆత్మపరిశీలన. ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికితేనే అవి తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోగలవు. జాతీయ పార్టీలకు ప్రత్యామ్నా యంగా నిలవాలంటే ప్రాంతీయ పార్టీలు కూడా తమను తాము మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజల విశ్వాసమే ఏ రాజకీయ పార్టీకి అసలైన బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకున్న వారే భవిష్యత్తులో రాజకీయ రంగంపై తమ ముద్ర వేయగలరు.

దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల పాత్రను విస్మరించడం సాధ్యం కాదు. జాతీయ పార్టీల ఆధిపత్యానికి ప్రత్యామ్నా యంగా, ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రతిరూపంగా అవి అవతరించాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల విధానాలకు చెక్ పెట్టడం లోనూ, సమాఖ్య వ్యవస్థ ను బలోపేతం చేయడంలోనూ ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషించాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో వాటి మనుగడ, భవిష్యత్తుపై కొత్త ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఇటీవల శివసేన ఎంపీ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశా యి. కాంగ్రెస్ నుంచి విడి పోయి ఏర్పడిన ప్రాంతీయ పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బీజేపీకి వ్యతిరేకంగా బలమైన ప్రత్యామ్నాయం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా కనిపిస్తున్నప్పటికీ, భారత రాజకీయాల వాస్తవికత మాత్రం భిన్నంగా ఉంది. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకపక్ష ఆధిపత్యానికి వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ నుంచి తమిళనాడులో ద్రవిడ పార్టీల వరకు అనేక రాజకీయ శక్తులు ప్రజల ఆశయాల కు ప్రతినిధులుగా ఎదిగాయి. వాటి ఆవిర్భావం కేవలం అధికార రాజకీయాల కోసం కాదు; ప్రాంతీయ స్వాభిమానాన్ని, స్థానిక ప్రయోజనాలను కాపాడాలనే సంకల్పం కూడా అందులో ఉంది. అందువల్ల ప్రాంతీయ పార్టీలన్నీ కాంగ్రెస్‌లో విలీనం కావాలన్న వాదన రాజకీయంగా సాధ్యమైన దిగా కనిపించదు. అలాంటి చర్యతో కాంగ్రెస్‌కు బలం చేకూరవ చ్చేమో గానీ, దేశ రాజకీయాల్లో ప్ర త్యామ్నాయ స్వరాలు బలహీనపడే ప్రమాదం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో విభిన్న రాజకీయ శక్తుల ఉనికి అవసరం. అదే సమాఖ్య వ్యవస్థకు బలాన్నిస్తుంది. అయితే ప్రాంతీయ పార్టీలకు కూడా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. కుటుంబ ఆధారిత రాజకీయాలు, వ్యక్తిపూజ, అధికార కేంద్రీకరణ, ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు వాటి విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు ప్రాంతీయ పార్టీలకు దూర మవుతున్న సంకేతా లు కని పించడం ఇందుకు నిదర్శనం. కేవలం ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా దీర్ఘకాలం రాజకీయ మనుగడ సాధ్యం కాదు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని, సమాజంలోని అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, అభివృద్ధి రాజకీయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే ప్రాంతీయ పార్టీలకు భవిష్యత్తు ఉంటుంది. కుటుంబాల చుట్టూ తిరిగే రాజకీయాలకు కాలం చెల్లిపోతోందన్న విషయాన్ని ఆయా పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది. జాతీయ పార్టీలతో పోలిస్తే ప్రాంతీయ పార్టీలకు స్థానిక అవసరాలను అర్థం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆ అవకాశాన్ని ప్రజల సంక్షేమం, సమగ్రాభివృద్ధి, పారదర్శక పాలన కోసం వినియోగించినప్పుడే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టు కోగలవు. లేకపోతే ప్రజలే వాటికి గుణపాఠం చెప్పడం అనివార్యం. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలకు అవసరమైంది విలీనాలు కాదు, ఆత్మపరిశీలన. ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికితేనే అవి తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోగలవు.

ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలకు అవసరమైంది విలీనాలు కాదు, ఆత్మపరిశీలన. ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికితేనే అవి తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోగలవు. జాతీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలవాలంటే ప్రాంతీయ పార్టీలు కూడా తమను తాము మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజల విశ్వాసమే ఏ రాజకీయ పార్టీకి అసలైన బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకున్నవారే భవిష్యత్తులో రాజకీయ రంగంపై తమ ముద్ర వేయగలరు.



## కేంద్ర పథకాలతో నిరుపేదల జీవితాల్లో మార్పు

- లబ్ధిదారులను కలిసి కేంద్ర పథకాల ప్రభావాన్ని తెలుసుకున్న ఎంపీ రఘునందన్‌రావు

**ప్రజానావ, సిద్ధిపేట:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సోమవారం సిద్దిపేట పట్టణంలోని లింగారెడ్డిపల్లి మొదటి వార్డులో ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భారీ శంకర్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు తాటికొండ శ్రీనివాస్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను నేరుగా కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులు మాట్లాడుతూ, గతంలో కట్టెల పొయ్యిలపై వంట చేయడం వల్ల పొగ కారణంగా కంటి, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదుర్కొనేవారమని, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అందిన తర్వాత ఆ ఇబ్బందులు తొలగిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ దేశ పురోగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకోవాలి

- ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేదు
- నిర్లక్ష్యాన్ని సహించం కలెక్టర్ అంకిత్



**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అధికారులు అత్యంత బాధ్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని హెచ్చరించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌ఓ పద్మావతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే అర్జీలను కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచడం ద్వారా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, తక్షణ పరిష్కారం సాధ్యమైన అంశాలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని పేర్కొన్న కలెక్టర్, ప్రజలు కూడా తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత సులభమవుతుందని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన వినతులు సమర్పించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాకు చెందిన దివ్యాంగుడు భూక్య సుమన్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని చేసిన వినతిని గృహనిర్మాణ శాఖ పీడీకి పంపించారు. మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన బట్ట కృష్ణవేణి తన కుమార్తెకు గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించాలని కోరగా, సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుజాతనగర్ మండలం చిమ్న తండాకు చెందిన భూక్య సేవ తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం జారీ కాకపోవడంతో భూమి మార్పిడి నిలిచిపోయిందని తెలియజేయగా, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ములకలపల్లి మండలం జగన్నాథపురానికి చెందిన రైతు స్వప్న తన భూమికి బోరు, విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరగా, ఆ దరఖాస్తును ఐటీడీఏ పీవోకు పంపించారు. ఇల్లందు మండలం బాలాజీ తండాకు చెందిన భానోత్ అనూష భూభారతి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరగా, సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలను నిరాశపరిచిన కాంగ్రెస్

- రైతులు, మహిళలు, పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలపై హరీష్‌రావు విమర్శలు
- శంకరాయకుంటలో బాల వికాస్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మాజీ మంత్రి



**ప్రజానావ, సిద్ధిపేట:** ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. సోమవారం సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం శంకరాయకుంట గ్రామంలో బాల వికాస్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచుతామని, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని, రైతు బంధు మొత్తాన్ని రూ.15 వేలుకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రైతు బీమా పథకాన్ని నిలిపివేసిందని, వడ్ల కొనుగోలు మరియు ఎరువుల సరఫరాలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజలకు ఆశలు చూపించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి సమస్యలను పరిష్కరించారని, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. శంకరాయకుంట గ్రామానికి కేసీఆర్‌కు ప్రత్యేక అనుబంధం ఉందని, గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గ్రామంలో బాల వికాస్ వాటర్ ప్లాంట్, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేశామని, నాగిరెడ్డి చెరువుకు కాళేశ్వరం నీటిని అందించామని తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం ఎంత ముఖ్యమో, దానిని భవిష్యత్తులో సమర్థంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యమని గ్రామ ప్రజలకు సూచించారు. గ్రామాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చిన హరీష్‌రావు, గ్రామంలో నిర్మించనున్న హనుమాన్ ఆలయానికి కూడా సహాయం అందిస్తానన్నారు. గ్రామ ప్రజలు ఐక్యతతో ముందుకు సాగి శంకరాయకుంటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, బాల వికాస్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజానావ, నల్లగొండ:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను భారీగా తగ్గించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే నిర్ణయం అమలైతే పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యా హక్కులకు తీవ్ర భంగం కలుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో యువజన సమ్మేళనం నిర్వహించనున్నట్లు జాన్ వెస్లీ వెల్లడించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశం, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కార్యాచరణ

- ఈ ఏడాది అదనంగా 2 వేల ఎకరాల లక్ష్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**ప్రజానావ, సిద్దిపేట :** సిద్దిపేట నియోజకవర్గంలో ఆయిల్ ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ఈ ఏడాది అదనంగా 2 వేల ఎకరాల్లో సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయిల్ ఫెడ్, ఉద్యానవన శాఖ అధికారులతో ఆయిల్ ఫామ్ సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, సిద్దిపేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ద్వారా రైతులకు మెరుగైన అవకాశాలు కల్పించామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 4,800 ఎకరాల్లో సుమారు 1,600 మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారని, ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ప్రయోజనాలపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, కొత్త రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మెగ్నీషియం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి, పొటాష్, యూరియా, ఎస్‌ఎస్‌పీ ఎరువులను ప్రతి మూడు నెలలకు ఒకసారి వినియోగించే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- మాదకద్రవ్యాల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాలు




**ప్రజానావ, సిద్దిపేట:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మి పెరుమాళ్‌తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్న కలెక్టర్, ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి అక్కడ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సూచిక బోర్డులు, ట్రబుల్ స్ట్రిప్స్, ఐరన్ బారికేడ్లు, బ్లింకర్లు, బస్‌బేలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కొమరవెల్లి కమాన్, దుద్దెడ ప్రాంతాల్లోని ప్రమాదకర మలుపులను సరిచేసేందుకు భూసేకరణ చేపట్టి రహదారులను నిటారుగా మార్చాలని సూచించారు. కొమరవెల్లి కమాన్ వద్ద బస్‌బే ఏర్పాటు చేయడంతో పాటు రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, డివైడర్ల మధ్య ఉన్న మొక్కలను క్రమబద్ధీకరించాలని హెచ్‌కేఆర్ రోడ్‌వేస్, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ, యూ–టర్న్‌ల వద్ద తగినంత లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రివేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని యూ–టర్న్‌ల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, రహదారుల పక్కన రేడియం స్టిక్కర్లు అమర్చాలని, ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చివేయాలని సూచించారు.

### మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టి

అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల ఆరోగ్యానికే కాకుండా సమాజానికీ ప్రమాదకరమని అన్నారు. పోలీసు, ఎక్సైజ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శాఖలు సమన్వయంతో పనిచేసి మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించారు. మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్న మందుల వివరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు నివసించే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. కల్తీ కల్లు విక్రయాలను అరికట్టడంతో పాటు విద్యాసంస్థల్లో నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని డి అడిక్షన్ సెంటర్‌లో చేరే వారి వివరాలను సంబంధిత శాఖలకు అందుబాటులో ఉంచాలని, జిల్లావ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భద్రయ్య అంతిమయాత్రలో మాజీ ఎంపీ నామ

- పాడె మోసి మానవత్వం చాటిన మాజీ ఎంపీ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం



**ప్రజానావ, ఖమ్మం :** రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగినా పుట్టిన ఊరు, గ్రామస్తులతో ఉన్న అనుబంధాన్ని మరువని నాయకుడిగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరోసారి నిలిచారు. మహబూబాబాద్ జిల్లా బలపాల గ్రామంలో జరిగిన ఓ అంతిమయాత్రలో ఆయన స్వయంగా పాడె మోసి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన వృద్ధుడు నామ భద్రయ్య(95) వృద్ధాప్య కారణాలతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోమవారం ఉదయం భద్రయ్య నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భద్రయ్యతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న నామ నాగేశ్వరరావు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన, శ్మశానవాటిక వరకు భద్రయ్య పాడెను తన భుజాలపై మోసి గ్రామస్తులను కదిలించారు. ప్రజాప్రతినిధిగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ సామాన్య కుటుంబంతో కలిసి నడుస్తూ ఆయన చూపిన ఆప్యాయత, మానవత్వం అందరి ప్రశంసలు అందుకుంది. మృతుడి కుమారుడు రమేష్, కుమార్తె విజయతో పాటు కుటుంబ సభ్యులను నామ నాగేశ్వరరావు, తాతా మధుసూదన్ పరామర్శించి ధైర్యం చెప్పారు. భద్రయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. భద్రయ్య అంతిమయాత్రలో గ్రామస్థులు, బంధువులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అశ్రునయనాల మధ్య తుది వీడ్కోలు పలికారు.

## ఓటరు జాబితా సవరణలో బీఎల్‌ఏ-2ల పాత్ర కీలకం

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనరెడ్డి

**ప్రజానావ, వనపర్తి :** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃసమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఎల్‌ఏ–2 సభ్యులు కీలక బాధ్యతలు నిర్వర్తించాలని వనపర్తి డీసీసీ చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పని చేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పట్టణ, మండల అధ్యక్షులకు పార్టీ కార్యక్రమాలు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. శివసేన రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ. సత్యరెడ్డి, కోళ్ల వెంకటేష్, శరవంద, మన్యం, బి. కృష్ణ, పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, సహదేవ్, దయాకర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, విష్ణు ముదిరాజ్, రవికిరణ్, బోయెజ్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక సమస్యల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ కీలక పాత్ర

- డాక్టర్ జనక్ ప్రసాద్ కృషితోనే కారుణ్య నియామకాల అమలు సాధ్యమైంది
- గొలేటి సీఎచ్‌పీ గేట్ మీటింగ్‌లో నాయకుల వ్యాఖ్యలు

**ప్రజానావ, బెల్లంపల్లి:** కార్మికుల సమస్యల పరిష్కారం, కారుణ్య నియామకాల అమలులో ఐఎన్‌టీయూసీ కీలక పాత్ర పోషిస్తోందని సంఘం నాయకులు పేర్కొన్నారు. గొలేటి సీఎచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. పిట్ కార్యదర్శి దుంద్రా రవి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఏరియా ఉపాధ్యక్షుడు పెరం శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కారుణ్య నియామక పత్రాల జారీ విషయంలో చాలా కాలంగా జాప్యం చోటుచేసుకుందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ నిరంతర కృషి ఫలితంగానే పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ సాధ్యమైందని తెలిపారు. సింగరేణిలో మెడికల్ బోర్డు పునరుద్ధరణ, మారుపేర్ల మార్పు వంటి సమస్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా 335 మంది డిపెండెంట్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం, మెడికల్ బోర్డును పునరుద్ధరించే దిశగా చర్యలు ప్రారంభం కావడం వెనుక డా. జనక్ ప్రసాద్ కృషి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు సత్యనారాయణ, సదానందం, అర్జయ్య, చంద్రయ్యతో పాటు పలువురు కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు పునరుద్ధరణపై కార్మికుల్లో హర్షం

- డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ, కార్మిక సమస్యల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ కృషి ఫలించింది
- ఓసీపీ 5 గేట్ మీటింగ్‌లో నాయకుల వ్యాఖ్యలు



**ప్రజానావ, రామగుండం:** ఆర్‌జీ–1 ఏరియాలోని జీడీకే ఓసీపీ 5లో సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. పిట్ సెక్రటరీ ఆంజనేయులు ఆధ్వర్యంలో, వైస్ ప్రెసిడెంట్ సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్మికుల విశ్వాసంతో ఆరు ఏరియాల్లో సంఘం విజయాన్ని సాధించి ప్రాతినిధ్య సంఘ హోదా పొందిందని తెలిపారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. జనక్ ప్రసాద్ కృషి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ అభ్యర్థుల నియామక ప్రక్రియ వేగవంతమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా డిపెండెంట్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజే యడం కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చిందన్నారు. సింగరేణి లో నిలిచిపోయిన మెడికల్ బోర్డు పునరుద్ధరణకు చర్యలు చేప ట్టడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీలు లక్ష్మీపతి గౌడ్, వికాస్ కుమార్ యాదవ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గడ్డం కృష్ణ, బేబీ శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ పోతరబోయిన సమ్మయ్య, జనగామ శ్రీనివాస్, సాగర్, నవీన్‌తో పాటు బ్రాంచ్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు

Singareni news

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**




**ప్రజానావ, రామగుండం:** సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో 335 మంది డిపెండెంట్ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించినప్పటికీ, సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించలేదన్నారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, పర్క్స్‌పై ఆదాయపన్ను మిన హాయింపు, ఇంటి నిర్మాణానికి వడ్డీ లేని రుణాలు వంటి హామీల అమలుపై ఇంకా స్పష్టత లేదని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు పునరు ద్ధరణ అంశంపై కూడా కార్మికులు చాలా కాలంగా ఎదురుచూ స్తు న్నారని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు తక్షణ ఉపశమనం కల్పించే చర్యలు అవసరమని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం అన్ని హామీలను అమలు చే యాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో టీబీజీకే ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షు డు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, సెంట్రల్ కమిటీ నాయకులు, బ్రాంచ్ కమిటీ ప్రతినిధులు, సింగరేణి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రామగుండం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**ప్రజానావ, గోదావరిఖని:** పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఉదయం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, 23వ డివిజన్ కార్పొరేటర్ బెంద్రం సునీత రాజిరెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డివిజన్ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అవసరాలు, మౌలిక వసతులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామగుండం ప్రాంతాన్ని గొప్ప నగరంగా అభివృద్ధి చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా చెత్తను కాలువల్లో వేయకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్ష.. ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు
- రోడ్డు ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయం అవసరం కలెక్టర్ రాజర్షి షా



**ప్రజానావ, ఆదిలాబాద్:** ఈ నెల 21న నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షను జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే కీలక పరీక్ష అని పేర్కొన్న కలెక్టర్, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, తగిన వెలుతురు, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, ఏఎన్ఎంలతో పాటు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించబోమని, విద్యార్థులు సమయ పాలన పాటించాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష

అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జరిగిన ఈ సమావే శంలో ప్రమాదాల నియంత్రణ, ప్రయాణికుల భద్రత, రహదారి భద్రతా చర్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఉట్నూర్ ఆర్డీవో మోహన్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏటీఎం కార్డు మోసగాడు అరెస్ట్

- పోలీసుల అదుపులో లక్షల రూపాయలు కాజేసిన అంతర్రాష్ట్ర నిందితుడు
- సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన మాచారెడ్డి పోలీసులు




**ప్రజానావ, కామారెడ్డి:** ఏటీఎం కేంద్రాల వద్ద అమాయకులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని కార్డులు మార్చి వారి ఖాతాల్లోని నగదును కాజేస్తున్న అంతర్రాష్ట్ర మోసగాడిని కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీసీ కెమెరా దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. లచ్చపేట గ్రామానికి చెందిన రైతు ఎర్రోళ్ల నర్సింలు తన కొత్త ఏటీఎం కార్డుకు పిన్ నంబర్ రూపొందించుకునేందుకు మాచారెడ్డి ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లగా, అక్కడ సహాయం చేస్తానంటూ నిందితుడు అతని కార్డును మార్చివేశాడు. అనంతరం ఎల్లారెడ్డిపేట, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతాల్లోని ఏటీఎంల ద్వారా బాధితుడి ఖాతా నుంచి రూ.49 వేల నగదును ఉపసంహరించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించి నిందితుడి కదలికలను గుర్తించారు. ఈ నెల 15న మాచారెడ్డి చౌరస్తాలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మరో మోసానికి యత్నిస్తున్న సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అతడిని పట్టుకున్నారు. విచారణలో అతడు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సీపాల ఈశ్వరయ్యగా తేలింది. నిందితుడు మాచారెడ్డి ఘటనతో పాటు కామారెడ్డిలో రూ.90,600, కడప జిల్లా వెంపల్లిలో రూ.30 వేలు, నిజామాబాద్ జిల్లాలో ఓ వృద్ధ మహిళ ఖాతా నుంచి రూ.10 వేలు అక్రమంగా డ్రా చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నివాసముంటున్న ఈశ్వరయ్య, విలాసవంతమైన జీవితం కోసం ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి రూ.46 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్, ఒక ఎస్‌బీఐ ఏటీఎం కార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్, రామాయంపేట్, జనగాం, షాబాద్, సంగారెడ్డి, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్ పరిధుల్లోనూ అతడిపై పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించిన కామారెడ్డి రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమన్, మాచారెడ్డి ఎస్ఐ అనిల్, సీసీఎస్ ఎస్ఐ ఎం.డి. ఉస్మాన్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## వయోధికుల పెండింగ్ కేసులను పరిష్కరించాలి

**ఆర్డీవోకు వినతి**

**ప్రజానావ, సిరిసిల్ల :** వయోధికుల పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని, బస్సు, రైలు చార్జీలలో రాయితీలు కల్పించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్ల కార్డులతో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.జనపాల శంకరయ్య నేతృత్వంలో జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి మండలంలో సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్ కార్యాలయం ఉండాలని, వయోధికుల ఆరోగ్య సంరక్షణ కోసం మొబైల్ హాస్పిటల్ వ్యాను, సీనియర్ సిటిజెన్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వం పూర్తిగా శ్రద్ధ తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కోడం నారాయణ, దొంత దేవదాసు, ఉపాధ్యక్షులు ఏనుగుల ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీరామరా జు, ఈసీ మెంబర్ జ్ఞానోభ, దేవనపల్లి శ్రీహరి, గజ్జెల్లి రామచంద్రం, ఇరుకుల్ల భాస్కర్, బుస బూమ్ లింగం, ఏకే ఖాన్ తదితరులు పాల్గొన్నారు





## బకాయిలను విడుదల చేయాలి

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రభుత్వం ఉత్పత్తి చేయించిన ఇందిరమ్మ చీరలు, ఇతర వస్త్రాలకు సంబంధించి సిరిసిల్ల ఉత్పత్తిదారులకు రావాల్సిన రూ.150 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవన్‌లో నిర్వహిం చిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఏడాదిగా బకాయిలు రాకపోవడంతో కొత్త ఆర్డర్ల ఉత్పత్తి నిలిచిపోయిందని, దీంతో ఉత్పత్తిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబి స్తోందని ఆరోపించారు. బకాయిలను వెంటనే విడుదల చేసి పరిశ్ర మ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, కోడం రమణ, సూరం పద్మ, అన్నల్దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

- విద్యుత్ అంతరాయాలపై ఎన్పీడీసీఎల్ 'హైపర్' యాక్షన్ ప్లాన్
- సీఎండీ వరుణ్‌రెడ్డి



**ప్రజానావ, హనుమకొండ:** భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు కలిగే అంతరాయాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎన్పీడీసీఎల్ ప్రత్యేకంగా 'హైపర్' యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని వెల్లడించారు. వర్షాకాలంలో విద్యుత్ వ్యవస్థపై ప్రభావం అధికంగా ఉండే నేపథ్యంలో, వినియోగదారులకు వీలైనంత త్వరగా సేవలు పునరుద్ధరించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతను వినియోగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాలపై ఖచ్చితమైన సమాచార సేకరణ, వేగవంతమైన స్పందన, క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన కార్యాచరణ కోసం 'హైపర్' ప్రణాళిక ఉపయోగపడు తోందన్నారు. ప్రతి సర్కిల్‌లో 'ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్'లను సిద్ధంగా ఉంచామని, మరమ్మతులకు అవసరమైన సామగ్రితో కూడిన ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ వాహనాలకు జీపీఆర్ఎస్ వ్యవస్థను అనుసంధానం చేయడం ద్వారా సమస్యలు తలెత్తిన ప్రాంతాలను వేగంగా గుర్తించి సిబ్బందిని అక్కడికి పంపించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సాంకేతికత వినియోగంలో ఎన్పీడీసీఎల్ ముందంజలో ఉందని పేర్కొన్న సీఎండీ, స్కాడా, జీఐఎస్, ఓఎంఎస్ వంటి డేటా వ్యవస్థలను ఏఐతో అనుసంధానం చేసినట్లు తెలిపారు. దీని ద్వారా ఫీడర్లలో తలెత్తే సమస్యలను 7 నుంచి 21 రోజుల ముందుగానే అంచనా వేసే అవకాశం కలుగుతుందని, విద్యుత్ డిమాండ్‌ను ముందే గుర్తించి సరఫరా నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయవచ్చన్నారు. విద్యుత్ లైన్ల పర్యవేక్షణ, లోపాల గుర్తింపు, నష్టాల అంచనాకు డ్రోన్ సాంకేతికతను వినియో గిస్తున్నామని తెలిపారు. సంస్థలోని ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేస్తూ, అవసరమైన సామగ్రితో సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమా చార మార్పిడి, ఆధునిక సాంకేతికత, సమన్వ యంతో కూడిన వ్యూహాల ద్వారా వినియో గదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఎన్పీడీసీఎల్ లక్ష్యమని కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు.

## జీడీకే 1, 3 ఇంక్లైన్ గనుల్లో

# ఎలక్ట్రికల్ భద్రతా తనిఖీలు

- విద్యుత్ వ్యవస్థల పనితీరు, భద్రతా ప్రమాణాలపై సమగ్ర పరిశీలన
- ప్రమాదాల నివారణకు నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారుల సూచన




**ప్రజానావ, రామగుండం:** సింగరేణి సంస్థలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ జీడీకే–1, జీడీకే–3 ఇంక్లైన్ గనుల్లో సోమవారం ఎలక్ట్రికల్ వ్యవస్థలపై సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించారు. జీఎం (సేఫ్టీ) కార్పొరేట్ సర్క్యులర్ మేరకు, ఆర్‌జీ–1 జనరల్ మేనేజర్ ఆదేశాలపై ఈ తనిఖీలు చేపట్టారు. ఆర్‌జీ–2 ఏరియా అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్ బి.వి. సత్యనారాయణ, వి.కె.పి. గ్రూప్ ఇంజనీర్ కె. గోపాల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో గనుల సర్ఫేస్ ఎలక్ట్రికల్ పరికరాలు, వాటి పనితీరు, భద్రతా ప్రమాణాల అమలు, నిర్వహణ రికార్డులు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ, గనులలో భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిం చడం ద్వారా ప్రమాదాలను సమర్థవంతంగా నివారించ వచ్చని పేర్కొన్నారు. విద్యుత్ పరికరాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించా రు. తనిఖీల సందర్భంగా గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుప రిచే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థలో సురక్షితమైన పనివాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి భద్రతా తనిఖీలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీకే–1 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జకుల్వార్, గ్రూప్ ఇంజనీర్ అల్లం ఒదేలు, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, పిట్ ఇంజనీర్ పి. శేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. క్రాంతి, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ (ఎలక్ట్రికల్) సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం

- పెట్రోలింగ్ బలోపేతంపై ఆదేశాలు
- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ వార్షిక తనిఖీలు
- ప్రజల భద్రత, నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచన



**ప్రజానావ, గోదావరిఖని:** వార్షిక తనిఖీల్లో భాగంగా గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న ఏసీపీకి ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తనిఖీల సందర్భంగా ఏసీపీ ముందుగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, వాటి పురోగతిని సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల స్వభావం, సిబ్బంది విధుల నిర్వహణ, అందుబాటులో ఉన్న మానవ వనరులపై వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానం, ఫంక్షనల్ వర్టికల్స్ సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడిన ఏసీపీ, విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో కొత్త వ్యక్తులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, డయల్–100కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రో లింగ్ వాహనాల ద్వారా క్రమబద్ధమైన గస్తీ నిర్వ హించి నేరాలను అరికట్టాలని తెలిపారు. ముఖ్యంగా తెల్లవారుజామున విధులు నిర్వహించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు రమేష్, మనోహర్, అనూషతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీఎంసీ ఎమ్మెల్యేపై గుడ్ల దాడి

- మమతా బెనర్జీ నివాసం వద్ద ఘటన
- దాడి చేసింది తానేనంటూ యువకుడి అంగీకారం
- ఇటీవల కాలంలో టీఎంసీ నేతలపై వరుస నిరసనలు

**కోల్‌కతా:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై సోమవారం కోల్‌కతాలో గుడ్లతో దాడి జరిగింది. టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసం నుంచి ఆయన బయటకు వస్తుండగా ఓ యువకుడు గుడ్లు విసిరాడు. అనంతరం దాడికి పాల్పడింది తానేనని అంగీకరించిన ఆ యువకుడు, తన చర్యను సమర్థించుకున్నాడు. "ప్రజలపై ఎన్నో అకృత్యాలు జరిగాయి. కునాల్ ఘోష్ కూడా అందుకు మినహాయింపు కాదు. మా పట్ల అనేక తప్పిదాలు జరిగాయి. అందుకే ఈ విధంగా నిరసన తెలిపాను" అని చందన్ అనే యువకుడు పేర్కొన్నాడు. అయితే ఈ ఘటనపై టీఎంసీ లేదా కునాల్ ఘోష్ వెంటనే ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల టీఎంసీ నేతలపై ఇలాంటి నిరసన ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. కొద్ది రోజుల క్రితం సీనియర్ నేత, ఎమ్మెల్యే మదన్ మిత్రా ఉత్తర 24 పరగణాల జిల్లాలోని అరియాదహ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో స్థానికులు ఆయన కాన్వాయ్‌పై గుడ్లు విసురుతూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మదన్ మిత్రా అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూడా స్థానిక సమస్యలు, అవినీతి ఆరోపణలు, అక్రమ వసూళ్ల అంశాలపై టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. అయితే ఈ ఘటనల వెనుక తమ రాజకీయ ప్రత్యర్థుల కుట్ర ఉందని టీఎంసీ ఆరోపిస్తోంది.

# మళ్లీ నిఫా కలకలం

- కోజికోడ్‌లో 43ఏళ్ల వ్యక్తికి వైరస్ నిర్ధారణ
- అప్రమత్తమైన కేరళ.. హై అలర్ట్ ప్రకటించిన తమిళనాడు




**తిరువనంతపురం:** దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ ఆందోళన రేకెత్తించింది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఓ వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్‌లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థ (ఎన్ఐవీ) నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్స ప్రారంభించారు.

## 87 మంది పర్యవేక్షణలో

బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ చేపట్టారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్నవారిని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్వారంటైన్‌లో ఉంచారు. ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్షల్లో నెగెటివ్ ఫలితాలే వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో వ్యాపించినట్లు ఎలాంటి సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిపుణుల బృందం కోజికోడ్‌కు చేరుకుంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి మార్గనిర్దేశం చేస్తోంది.

## చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలు

కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూరు, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేశారు. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, చోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం సరిహద్దు దాటే కార్మికులకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని ప్రత్యేక వైద్య శిబిరాలకు తరలించి పర్యవేక్షణలో ఉంచుతున్నారు. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు వాలామార్, ఉడుమలైపేట, నాడుగని, తాళూర్, చోలాడి, పట్టవాయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక ఆరోగ్య బృందాలను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు పనిచేసేలా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు వంటి నిఫా వైరస్ ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని ప్రత్యేకంగా గుర్తించి అవసరమైతే ఐసోలేషన్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.

## ఆస్పత్రులకు కీలక ఆదేశాలు

నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల ప్రయాణ వివరాలను నిశితంగా పరిశీలించాలని, అనుమానాస్పద కేసులను వెంటనే రాష్ట్ర సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదని హెచ్చరిస్తున్నారు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

# శాంతి, స్థిరత్వం పునరుద్ధరించాలి

- అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందంపై ఎక్స్ వేదికగా స్పందించిన మోదీ
- స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్న ప్రధాని

**న్యూఢిల్లీ:** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు ఇరు దేశాలు అంగీకారానికి రావడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. పశ్చిమాసియాలో కొనసాగిన ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు అనేక దేశాల్లో ప్రాణనష్టానికి దారితీశాయని మోదీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా, ఇరాన్ ముందడుగు వేయడం స్వాగతించదగ్గ విషయమన్నారు. ఈ ఒప్పందం ద్వారా పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు స్వేచ్ఛా నౌకాయానం, అంతర్జాతీయ వాణిజ్యానికి భరోసా కలుగుతుందని భారత్ విశ్వసిస్తోందని తెలిపారు. మిగిలిన అంశాలపై కూడా సానుకూల చర్చలు జరిగి సుస్థిరమైన తుది ఒప్పందానికి మార్గం సుగమం కావాలని ఆకాంక్షించారు. కాగా, ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, టెహ్రాన్ కూడా దీనిని ధ్రువీకరించింది. ఈ ఒప్పందంపై జూన్ 19న స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాలు అధికారికంగా సంతకాలు చేయనున్నట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది.

# సుందర్ పిచాయ్‌కు చేదు అనుభవం


- ప్రసంగిస్తుండగా స్టాన్‌ఫోర్డ్ విద్యార్థుల వాకౌట్
- ఇజ్రాయెల్‌తో గూగుల్ ఒప్పందానికి వ్యతిరేకంగా నిరసన



**శాన్‌ఫ్రాన్సిస్కో:** గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమంలో చేదు అనుభవం ఎదురైంది. ఆయన ప్రసంగం కోసం వేదికపైకి వచ్చిన వెంటనే పలువురు విద్యార్థులు వాకౌట్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ప్రభుత్వంతో గూగుల్‌కు ఉన్న ఒప్పందాలను వ్యతిరేకిస్తూ, పాలస్తీనాకు మద్దతుగా వారు ఈ చర్యకు దిగారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, గూగుల్, అమెజాన్, ఇజ్రాయెల్ ప్రభుత్వం మధ్య కుదిరిన 'ప్రాజెక్ట్ నింబస్' ఒప్పందమే ఈ నిరసనకు కారణమైంది. 1.2 బిలియన్ డాలర్ల విలువైన ఈ క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్టు ద్వారా ఇజ్రాయెల్ ప్రభుత్వ కార్యకలాపాలకు మద్దతు లభిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వాకౌట్ చేపట్టనున్నట్లు వారు ముందుగానే ప్రకటించారు. విద్యార్థుల నిరసన మధ్య కూడా సుందర్ పిచాయ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగం అనంతరం విద్యార్థుల వాకౌట్‌పై ప్రశ్నలు ఎదురైనప్పటికీ, ఆ అంశంపై స్పందించేందుకు పిచాయ్ ఆసక్తి చూపలేదు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ దృశ్యాలను ఎక్స్ వేదికగా పంచుకున్న మాజీ కేంద్ర మంత్రి, భాజపా నాయకుడు రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ, ఈ తరహా ప్రవర్తన మూర్ఖత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

# నీట్ పోర్టల్‌లో భద్రతా లోపం బట్టబయలు

- 150 మంది విద్యార్థుల రీఫండ్ కాజేసిన యువకుడు



**అహ్మదాబాద్:** నీట్–యూజీ పరీక్ష పత్రాల లీక్ నేపథ్యంలో ఈ నెల 21న రీ–ఎగ్జామ్ నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేస్తున్న వేళ, నీట్ పోర్టల్‌లో మరో భద్రతా వైఫల్యం వెలుగులోకి వచ్చింది. అభ్యర్థుల ఖాతాల్లోకి చొరబడి రీఫండ్ నగదును అక్రమంగా తన ఖాతాకు మళ్లించిన బిహార్‌కు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్‌ను అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌లోని గయా ప్రాంతానికి చెందిన నవీన్ యాదవ్ నీట్ పోర్టల్‌లోని భద్రతా లోపాలను, బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఆసరాగా చేసుకుని 350 మందికిపైగా విద్యార్థుల ఖాతాలను లక్ష్యంగా చేసుకున్నాడు. ట్రయల్–అండ్–ఎర్రర్ విధానమైన 'బ్రూట్ ఫోర్స్' సాయంతో సుమారు 150 ఖాతాల్లోకి విజయవంతంగా ప్రవేశించాడు. అనంతరం విద్యార్థుల ప్రొఫైల్‌లకు అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలను తొలగించి, తన ఖాతా సమాచారాన్ని నమోదు చేశాడు. దీంతో ఒక్కో అభ్యర్థికి అందాల్సిన రూ.1,700 రీఫండ్ మొత్తం అతడి ఖాతాలో జమైంది. నీట్–యూజీ పోర్టల్‌లో అనుమానాస్పద రీఫండ్ లావాదేవీలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని బిహార్‌లో అదుపులోకి తీసుకుంది. మొదట నిర్వహించిన నీట్–2026 పరీక్ష రద్దు కావడంతో అభ్యర్థులకు పరీక్ష ఫీజును ఎన్‌టీఏ తిరిగి చెల్లిస్తుండగా, అదే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిందితుడు ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో నీట్ పోర్టల్ భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసిన ఎన్‌టీఏ, విద్యార్థులు తమ పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించింది. సులభంగా ఊహించగలిగే పాస్‌వర్డ్‌లకు బదులుగా క్లిష్టమైన, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని సూచించింది.


# అమెరికాలో ఘోర విమాన ప్రమాదం

- మిస్సోరీలో కుప్పకూలిన స్కైడైవింగ్ విమానం
- 11 మంది స్కైడైవర్లు,పైలట్ మృతి

**మిస్సోరీ:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్టు సమీపంలో స్కైడైవింగ్ కోసం ప్రయాణికులను తీసుకెళ్తున్న పసిఫిక్ ఎయిరోస్పేస్ పీ–750ఎల్ సింగిల్ ఇంజిన్ టర్బోప్రాప్ విమానం కుప్పకూలి మంటల్లో చిక్కుకోవడంతో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ సహా మొత్తం 12 మంది దుర్మరణం పాలయ్యారు. టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు అధికారులు భావిస్తున్నారు. అవసరమైన ఎత్తుకు చేరుకోక ముందే విమానం అదుపుతప్పి రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో కూలిపోయింది. ఘటన జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు సహాయక చర్యలు చేపట్టినప్పటికీ, విమానం పూర్తిగా మంటల్లో చిక్కుకోవడంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ), నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్‌టీఎస్‌బీ) దర్యాప్తు చేపట్టాయి.

# యోగాకు విశేష ఆదరణ

- ఈసారి 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో కోల్‌కతాలో నిర్వహణ
- నాయకత్వం వహించనున్న ప్రధాని మోదీ
- కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్



స్లోవేకియా దేశ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినితో కలిసి యోగా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ:** యోగాతో ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈసారి పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వహించి యోగాసనాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే అంశాన్ని ప్రధాన థీమ్‌గా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు విశేష ఆదరణ లభిస్తోందని, లక్షలాది మంది తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా మార్చుకున్నారని చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) సమన్వయంతో విదేశాల్లోని 210కిపైగా భారత మిషన్లు ప్రపంచవ్యాప్తంగా సుమారు 2,500 ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జాదవ్ వెల్లడించారు.

### మోదీ ప్రతిపాదనతోనే యోగా దినోత్సవం

యోగాను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ 2014 సెప్టెంబరు 27న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 69వ సమావేశంలో ప్రతి ఏడాది జూన్ 21ను 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరపాలని ప్రతిపాదించారు. అనంతరం అదే ఏడాది డిసెంబరు 11న 177 సభ్య దేశాల మద్దతుతో ఐరాస ఈ తీర్మానాన్ని ఆమోదించింది. దీంతో 2015 నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



స్లోవేకియాలో భారత్, స్లోవాక్ సంస్కృతుల స్ఫూర్తితో రూపొందించిన కళాకృతుల ప్రదర్శనను ఆ దేశ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినితో కలిసి వీక్షిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.

# బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లో ముఖేశ్ అంబానీ పూజలు

- ఆలయాల అభివృద్ధికి రూ.10 కోట్ల విరాళం
- యాత్రికుల సౌకర్యాల కల్పనకు సహకారం

**నైనిటాల్:** ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ సోమవారం సందర్శించారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో బద్రీనాథ్‌కు చేరుకున్న ముఖేశ్ అంబానీకి బద్రీ–కేదార్ దేవస్థానం కమిటీ (బీకేటీసీ) అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన బద్రీనాథ్ ఆలయంలో శ్రీ బద్రీనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లిన అంబానీ అక్కడ కూడా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# అమెరికా వైఖరిపై రాహుల్, ఖర్గే ఫైర్

భారత నావికుల మృతిపై స్పందన లేదని కేంద్రంపై విమర్శలు



**న్యూఢిల్లీ:** ఒమన్ తీరంలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై అమెరికా స్పందించిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. నావికుల మృతిపై విచారం వ్యక్తం చేయకుండా, భారత్‌ను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేయడం సరికాదని ఆయన విమర్శించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన రాహుల్ గాంధీ, ముగ్గురు భారతీయుల మృతిపై కనీసం సంతాపం వ్యక్తం చేయని అమెరికా, తన ఆదేశాలను తక్షణమే పాటించాలని కోరుతోందని పేర్కొన్నారు. సార్వభౌమాధికారం కలిగిన ఏ దేశమైనా ఇలాంటి వ్యాఖ్యలను సహించదని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ఆదేశాలకు విధేయుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజీపడే నాయకత్వం దేశ గౌరవాన్ని కాపాడలేదని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. భారతీయ నావికులు మరణించి మూడు రోజులు గడిచినా, ప్రధాని మోదీ నుంచి కనీసం ఒక సంతాప సందేశం కూడా రాలేదని ఆయన ఆరోపించారు. దేశ ప్రతిష్ఠ, సార్వభౌమాధికారాన్ని కేంద్ర ప్రభుత్వం దిగజార్చిందని, జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఖర్గే విమర్శించారు. 'విశ్వగురు' అనే ప్రచారంతో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల ఈ వ్యాఖ్యలు దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# రష్యా 'షాడో ఫ్లీట్' నౌకలో భారతీయుడి అరెస్ట్


- ఆంక్షల ఉల్లంఘన ఆరోపణలపై అదుపులోకి తీసుకున్న బ్రిటన్ అధికారులు



**లండన్:** రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్ 'స్మిట్రోస్'లో సోదాలు నిర్వహించిన బ్రిటన్ నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్‌సీఏ) ఓ భారతీయుడిని అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని యూకే అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఎన్‌సీఏ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం, 38 ఏళ్ల భారత పౌరుడిని మాస్కోపై అమలులో ఉన్న ఆంక్షలను ఉల్లంఘించినట్లు అనుమానిస్తూ అదుపులోకి తీసుకున్నారు. అయితే, అతడిపై ఉన్న ఆరోపణల స్వరూపం ఏమిటన్న దానిపై అధికారులు వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని, దర్యాప్తు ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని వివరాలు వెల్లడించలేమని పేర్కొన్నారు. ఈ నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉన్నారని, వారిలో భారత్, జార్జియాకు చెందిన పౌరులు ఉన్నట్లు యూకే అధికారులు తెలిపారు. అరెస్టయిన భారతీయుడి పేరు, ఇతర వ్యక్తిగత వివరాలను మాత్రం ఇప్పటివరకు వెల్లడించలేదు.

# స్వదేశీ క్రూజ్ క్షిపణి ప్రయోగం విజయవంతం

డీఆర్‌డీవోకు రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు



**భువనేశ్వర్:** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన దీర్ఘ శ్రేణి భూ దాడి క్రూజ్ క్షిపణి (లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూజ్ మిస్సైల్) ప్రయోగం విజయవంతమైంది. ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ క్షిపణి నిర్దేశిత లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రయోగం విజయవంతం కావడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల బృందాన్ని అభినందించారు. ఈ విజయంతో భారత రక్షణ సామర్థ్యాలు మరింత బలోపేతం అయ్యాయని, స్వదేశీ క్షిపణి సాంకేతికత అభివృద్ధిలో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించిందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేసే దిశగా ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# సూపర్ ఓవర్‌లో కుర్రాళ్ల ఓటమి



- ఉత్కంఠభరిత మ్యాచ్‌లో శ్రీలంక ఏ జట్టు ఘన విజయం

**దంబుల్లా:** ముక్కోణపు సిరీస్‌లో భాగంగా సోమవారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో శ్రీలంక ఏ జట్టు సూపర్ ఓవర్‌లో భారత్ ఏపై విజయం సాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో ఇరు జట్లు 265 పరుగులు చేయడంతో మ్యాచ్ టై కాగా, సూపర్ ఓవర్‌లో లంక జట్టు పైచేయి సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక ఏ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులే చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. చివరి ఓవర్లో శ్రీలంక విజయానికి ఐదు పరుగులు అవసరమవగా, భారత పేసర్ అర్షద్ ఖాన్ తొలి ఐదు బంతుల్లో మూడు పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీశాడు. చివరి బంతికి రెండు పరుగులు అవసరమైన పరిస్థితిలో లెగ్‌బై రూపంలో ఒక పరుగు వచ్చినా, రెండో పరుగుకు ప్రయత్నించిన గుణశేఖర (18) రనౌట్ కావడంతో స్కోర్లు సమమయ్యాయి. సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఏ 16 పరుగులు చేయగా, భారత్ ఏ తొమ్మిది పరుగులకే పరిమితమైంది. శ్రీలంక ఇన్నింగ్స్ ప్రారంభంలో భారత ఆటగాడు విప్రాజ్ నిగమ్ డేంజర్ ఏరియాలోకి రావడంతో అంపైర్లు 10 పరుగులను పెనాల్టీగా విధించడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. లంక బ్యాటర్లలో సదీర సమరవిక్రమ 102 బంతుల్లో 83 పరుగులతో రాణించాడు. నిరోషన్ డిక్వెల్లా 37, వనుజ సహన్ 25, అవిష్క ఫెర్నాండో 22 పరుగులు చేశారు. భారత బౌలర్లలో ఆయుష్ బదోని రెండు వికెట్లు పడగొట్టగా, అర్షద్ ఖాన్, నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, అనుకుల్ రాయ్, సుర్యాంశ్ తలో వికెట్ సాధించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ ఏకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. 125 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన జట్టును సుర్యాంశ్ షెడ్జే (72), విప్రాజ్ నిగమ్ (51) ఆదుకున్నారు. కెప్టెన్ తిలక్ వర్మ 23, ఉప కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 37 పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో విజయ్‌కాంత్, షిరాజ్ తలో మూడు వికెట్లు సాధించి భారత్‌ను కట్టడి చేశారు.

### లంక ఆటగాళ్లతో వైభవ్ వాగ్వాదం

భారత్ ఏ–శ్రీలంక ఏ మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ అనంతరం ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మ్యాచ్‌లో విజయం సాధించిన శ్రీలంక ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, కొందరు భారత ఓపెనర్లతో వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. దీంతో భారత ఆటగాడు సుర్యాంశ్ షెడ్జే లంక ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఆగ్రహంతో వివాదంలోకి ప్రవేశించాడు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చే పరిస్థితులు నెలకొనగా, వైభవ్ ఓ శ్రీలంక ఆటగాడిని ఛాతీపై చేయితో నెట్టినట్లు తెలుస్తోంది. దీనికి ఆ ఆటగాడు కూడా ప్రతిస్పందించడంతో ఉద్రిక్తత మరింత పెరిగే సూచనలు కనిపించాయి. అయితే, శ్రీలంక వికెట్‌కీపర్ నిరోషన్ డిక్వెల్లా వెంటనే జోక్యం చేసుకుని వైభవ్‌ను అక్కడి నుంచి దూరంగా తీసుకెళ్లడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకుంటూ మైదానం వీడినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ మాత్రం పెవిలియన్ వైపు వెళ్తూ శ్రీలంక ఆటగాళ్లను ఉద్దేశించి ఏదో వ్యాఖ్యలు చేసినట్లు కనిపించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, ఈ వివాదంపై ఇరు జట్ల యాజమాన్యాలు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## వీక్షణల్లో ఐపీఎల్ సరికొత్త రికార్డులు

- టీవీ, డిజిటల్ వేదికల్లో 1.2 బిలియన్ల మంది వీక్షణ
- గత సీజన్‌తో పోలిస్తే 7 శాతం వృద్ధి
- ఫైనల్‌ను వీక్షించిన 400 మిలియన్ల మంది: జియోహాట్‌స్టార్

**ముంబై:** ఇటీవల ముగిసిన ఐపీఎల్–2026 సీజన్‌కు అభిమానుల నుంచి అపూర్వ స్పందన లభించింది. స్టేడియాల్లో ప్రేక్షకులు భారీగా తరలిరాగా, టీవీలు, డిజిటల్ వేదికల ద్వారా కోట్లాది మంది మ్యాచ్‌లను వీక్షించారు. దీంతో ఈ సీజన్ వీక్షణ పరంగా కొత్త రికార్డులను సృష్టించింది. అధికారిక బ్రాడ్‌కాస్టర్ జియోహాట్‌స్టార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఐపీఎల్–2026ను టెలివిజన్, డిజిటల్ వేదికల్లో కలిపి మొత్తం 1.2 బిలియన్ల మంది వీక్షించారు. ఇది గత సీజన్‌తో పోలిస్తే 7 శాతం అధికం. మొత్తం వీక్షణ సమయం 870 బిలియన్ నిమిషాలకు చేరినట్లు సంస్థ పేర్కొంది. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ కూడా చరిత్ర సృష్టించింది. ఈ పోరును 400 మిలియన్ల మంది వీక్షించినట్లు జియోహాట్‌స్టార్ వెల్లడించింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక మంది వీక్షించిన మ్యాచ్‌గా ఇది నిలిచింది. డిజిటల్ వేదికల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. కనెక్టెడ్ టీవీల వినియోగం 22 శాతం పెరగ్గా, డిజిటల్ వీడియో వీక్షణలు 25 బిలియన్లకు చేరుకున్నాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అధికం. అలాగే, ప్రాంతీయ భాషల కంటెంట్ వీక్షణ సమయం వాటా 33 శాతం పెరిగినట్లు జియోహాట్‌స్టార్ వెల్లడించింది. ఐపీఎల్‌కు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ, డిజిటల్ వేదికల విస్తరణతో క్రికెట్ వీక్షణలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## దోహా డైమండ్ లీగ్‌తో నీరజ్ చోప్రా

**న్యూఢిల్లీ:** భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా ఈ ఏడాది తన తొలి పోటీకి సిద్ధమయ్యాడు. వెన్ను గాయం నుంచి పూర్తిగా కోలుకున్న నీరజ్ శుక్రవారం జరిగే దోహా డైమండ్ లీగ్‌లో పాల్గొననున్నాడు. ప్రస్తుతం 47 రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో భాగంగా స్విట్జర్లాండ్‌లో ఉన్న అతడు, ''దోహాలో కలుద్దాం'' అంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన రాకను ధ్రువీకరించాడు. ఈ టోర్నీలో నీరజ్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది.

ఇటీవల రోమ్‌లో 92.62 మీటర్లు విసిరిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగా, ప్రపంచ ఛాంపియన్ కేశార్న్ వాల్కాట్ బరిలో ఉండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. గత ఏడాది దోహా డైమండ్ లీగ్‌లో 90.23 మీటర్ల త్రోతో రెండో స్థానంలో నిలిచిన నీరజ్, 90 మీటర్ల మార్కును అధిగమించిన తొలి భారత అథ్లెట్‌గా చరిత్ర సృష్టించాడు. ఈసారి కూడా అత డు ఎలాంటి ప్రదర్శన చేస్తాడన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. వాస్తవానికి ఈ పోటీలు మే 8న జరగాల్సి ఉండగా, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో వాయిదా పడి ఇప్పుడు నిర్వహించబడుతున్నాయి. దీంతో ఈ సీజన్‌లో నీరజ్ తొలి ప్రదర్శనపై క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సోమవారం జరిగిన రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్–2 ఆవిష్కరణ కార్యక్రమంలో క్రీడాకారులతో కలిసి పాల్గొన్న లీగ్ కమిషనర్ రాహుల్ బోస్

# స్పెయిన్‌కు షాక్

## చారిత్రక పాయింట్ సాధించిన కాబో వెర్డ్

**అట్లాంటా:** ఫిఫా ప్రపంచకప్ గ్రూప్–హెచ్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఫేవరెట్ స్పెయిన్‌కు కాబో వెర్డ్ షాకిచ్చింది. ప్రపంచకప్‌లో తొలిసారి బరిలోకి దిగిన కాబో వెర్డ్ జట్టు స్పెయిన్‌ను 0–0తో నిలువరించి చారిత్రకంగా తొలి పాయింట్‌ను ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ మొత్తంలో 74 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న స్పెయిన్ గోల్ సాధించడంలో విఫలమైంది. కాబో వెర్డ్ రక్షణ పటిష్ఠంగా ఆడి స్పెయిన్‌కు అవకాశమే ఇవ్వలేదు.

### ట్యునీషియాపై స్వీడన్ గోల్స్ వర్షం

మరో మ్యాచ్‌లో స్వీడన్ జట్టు ట్యునీషియాపై 5–1 తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఏడో నిమిషంలో యాసిన్ అయారి గోల్‌తో ఖాతా తెరిచిన స్వీడన్‌కు, 30వ నిమిషంలో అలెక్సాండర్ ఐసాక్ మరో గోల్ జోడించి 2–0 ఆధిక్యం అందించాడు. 43వ నిమిషంలో ఒమర్ రెకిక్ గోల్‌తో ట్యునీషియా స్కోరును 2–1కు చేర్చినా, రెండార్థంలో విక్టర్ (59వ నిమిషం), మాట్టియస్ (84వ నిమిషం) గోల్స్‌తో స్వీడన్ ఆధిక్యాన్ని పెంచుకుంది. అదనపు సమయంలో యాసిన్ అయారి మరో గోల్ నమోదు చేయడంతో స్వీడన్ 5–1 తేడాతో ఘన విజయం సాధించింది.

### ఈక్వెడార్‌ను ఓడించిన ఐవరీ కోస్ట్

ఫిఫా ప్రపంచకప్‌లో ఐవరీకోస్ట్ శుభారంభం చేసింది. సోమవారం జరిగిన గ్రూప్–ఇ మ్యాచ్‌లో ఆ జట్టు 1–0 తేడాతో ఈక్వెడార్‌ను ఓడించింది. మ్యాచ్ ముగింపు దశ వరకు ఇరు జట్లు గోల్ చేయలేకపోవడంతో పోరు డ్రాగా ముగుస్తుందని భావించిన సమయంలో అమాద్ డియాలో హీరోగా నిలిచాడు. 56వ నిమిషంలో ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగిన డియాలో.. మ్యాచ్ చివరి నిమిషంలో అద్భుత గోల్‌తో ఐవరీకోస్ట్‌కు విజయాన్ని అందించాడు. పెనాల్టీ ప్రాంతానికి సమీపం నుంచి ఎడమ కాలితో కొట్టిన షాట్ ఈక్వెడార్ గోల్‌కీపర్ హెర్నాన్ గలియాండెజ్‌ను మోసగించి నేరుగా గోల్‌పోస్ట్‌లోకి దూసుకెళ్లింది.2014 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఐవరీకోస్ట్ ఈ విజయంతో నాకౌట్ దశకు చేరే అవకాశాలను మెరుగుపరుచుకుంది. మరోవైపు, ఈక్వెడార్ 19 మ్యాచ్‌ల అజేయ పరంపరకు ముగింపు పలికింది. ఆ జట్టు చివరిసారిగా 2024 సెప్టెంబరులో బ్రెజిల్ చేతిలో ఓటమి చవిచూసింది. మ్యాచ్‌లో బంతి అధిక సమయం ఈక్వెడార్ ఆధీనంలో ఉన్నప్పటికీ, దాడుల్లో మాత్రం ఐవరీకోస్ట్ ఆధిపత్యం ప్రదర్శించింది.



## 21 నుంచి టీజీ20 లీగ్

- ఉప్పల్ వేదికగా ఎనిమిది జట్ల మధ్య పోటీ
- పాలమూరు స్ట్రైకర్స్, ఖమ్మం ఏసెస్‌తో తొలి మ్యాచ్
- జులై 12న ఫైనల్ సమరం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ క్రికెట్‌కు కొత్త ఊపు తీసుకురావడంతో పాటు యువ ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ–20 లీగ్‌కు రంగం సిద్ధమైంది. జట్ల ఎంపిక, ఆటగాళ్ల వేలం ప్రక్రియ పూర్తికాగా, అన్ని ఫ్రాంచైజీల ఆటగాళ్లు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. జూన్ 21 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీకి సంబంధించిన మ్యాచ్‌ల షెడ్యూల్‌ను హెచ్‌సీఏ విడుదల చేసింది. మొత్తం ఎనిమిది జట్లు బరిలోకి దిగుతుండగా, ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ జట్లు తలపడనున్నాయి. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు జూన్ 23న పాలమూరు స్ట్రైకర్స్‌తో జరిగే మ్యాచ్‌తో తమ ప్రచారాన్ని ప్రారంభించనుంది. జులై 7తో లీగ్ దశ ముగియనుండగా, జులై 12న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టోర్నీలోని అన్ని మ్యాచ్‌లు ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

### ప్లేఆఫ్స్ షెడ్యూల్ ఇలా..

లీగ్ దశ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లు జులై 9న ఎలిమినేటర్‌లో తలపడతాయి. ఇందులో విజేత రెండో క్వాలిఫయర్‌కు చేరుకోగా, ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. అదే రోజు రాత్రి జరిగే తొలి క్వాలిఫయర్‌లో పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు జులై 10న జరిగే రెండో క్వాలిఫయర్‌లో ఎలిమినేటర్ విజేతతో పోటీ పడుతుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఫైనల్‌కు చేరుతుంది. జులై 12న టైటిల్ పోరు జరగనుంది.


## కోహ్లీ అహంకారే..

- ఆట బయట అతడు పూర్తిగా భిన్నం
- విరాట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మాజీ కోచ్ రవిశాస్త్రి

**ముంబై:** టీమిండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వ్యక్తిత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ అహంకారి, అతిగా గారాబంగా పెరిగిన పిల్లాడని పేర్కొంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్ట్‌పై స్పందించిన రవిశాస్త్రి, ఆ వ్యాఖ్యల్లో కొంత నిజం ఉన్నప్పటికీ అది కేవలం మైదానం వరకేనని స్పష్టం చేశారు. 'అవును.. విరాట్ కోహ్లీ అహంకారే. ఉద్రేకంగా ఉంటాడు. మితిమీరిన దూకుడు ప్రదర్శిస్తాడు. కానీ ఇవన్నీ ఆటలో భాగంగానే కనిపిస్తాయి. మైదానం నుంచి బయటకు వచ్చిన తర్వాత అతడు పూర్తిగా భిన్నంగా ఉంటాడు. మైదానంలో తీవ్ర పోటీ తత్వంతో ఉండి, బయట సాధారణంగా వ్యవహరించే వ్యక్తులంటే నాకు చాలా ఇష్టం' అని రవిశాస్త్రి వ్యాఖ్యానించారు. ఇక, ఐపీఎల్–2026 ఫైనల్‌లో తొడ కండరాల గాయానికి గురైన కోహ్లీ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. గాయం కారణంగా అఫ్గానిస్థాన్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. అయితే గాయంతోనే ఐపీఎల్ ఫైనల్లో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ వేగంగా కోలుకుంటున్నాడని, ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



## ఏఐ ప్రయోజనాలు కొన్ని కంపెనీలకే పరిమితం కావొద్దు



- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

**న్యూఢిల్లీ:** ప్రపంచమంతా కృత్రిమ మేధ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు కొద్ది కంపెనీల నియంత్రణలోనే ఉండిపోతే, పలు రంగాలు తమ నైపుణ్యాన్ని, దీర్ఘకాలిక పోటీతత్వాన్ని కోల్పోయి సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మానవ నైపుణ్యాన్ని కేంద్రంగా చేసుకుని ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సంస్థలకు సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు పరస్పరం ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకునే దశలోకి వ్యాపార రంగం ప్రవేశిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్పాదకత పెంపుతో పాటు పలు ఇతర రంగాల్లో కూడా కృత్రిమ మేధ వినియోగం విస్తరిస్తున్నందున, రాబోయే ఏఐ యుగం గత సాంకేతిక పరివర్తనల కంటే భిన్నంగా ఉండబోతుందని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు.

భవిష్యత్ సంస్థల ఎదుగుదలలో మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతతో పాటు ఏఐ సాంకేతికత కూడా సమానంగా కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా పరిగణించకుండా, మానవ ఆలోచనలను విస్తరించే, ప్రజలు తమ లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడే సాధనంగా చూడాలని సూచించారు. ఏఐ సామర్థ్యం పెరిగే కొద్దీ మానవ నైపుణ్యాలు కూడా మరింత మెరుగుపడతాయని చెప్పారు. సం స్థల లక్ష్యాల రూపకల్పనలో, విభిన్న రంగాల ఆలోచనలను సమన్వయం చేయడంలో ఉద్యోగుల పాత్ర ఎప్పటికీ కీలకంగానే ఉంటుందని సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. విదేశీ ఏఐ సాంకేతికతపై అధికంగా ఆధారపడకుండా, సంస్థలు తమ సొంత సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా మరింత బలోపేతం కావాలని సూచించారు.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్‌మార్కెట్లు

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు సడలడంతో కొనుగోళ్ల జోరు
- 736 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్, 23,853 వద్ద నిఫ్టీ
- చమురు ధరలు తగ్గడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం



**ముంబై:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు సడలుతున్న సంకేతాలు, అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ప్రకటనలు రావడంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకోనున్న నేపథ్యంలో చమురు ధరలు తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్లకు ఊతమిచ్చింది. కొనుగోళ్ల జోరుతో సెన్సెక్స్ ఒక దశలో 1,200 పాయింట్లకు పైగా లాభపడగా, చివర్లో అమ్మకాల ఒత్తిడి కారణంగా కొంత మేర లాభాలు తగ్గాయి. సెన్సెక్స్ 736.38 పాయింట్లు పెరిగి 76,264.33 వద్ద ముగిసింది. నిఫ్టీ 231 పాయింట్లు లాభపడి 23,853.90 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 76,725.27 పాయింట్ల వద్ద ప్రారంభమై, ఇంట్రాడేలో 76,821.07 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.71 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ సూచీలో ట్రెంట్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటర్నల్ షేర్లు లాభపడగా, ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్ల వద్ద ట్రేడయింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, యూరోపియన్ మార్కెట్లు కూడా సానుకూల ధోరణితో ప్రారంభమయ్యాయి.

### మళ్లీ పసిడి పరుగులు

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి పెరుగుదల బాట పట్టాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, రూపాయి మారకం విలువ బలపడడం వంటి పరిణామాల నేపథ్యంలో విలువైన లోహాలకు డిమాండ్ పెరిగింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మూడు నెలలకు పైగా కొనసాగిన ఉద్రిక్తతలకు తెరపడినట్లైంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గి, బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 83 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 53 పైసలు బలపడి 93.65 వద్ద కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,490కు చేరుకుంది. వెండి ధర కూడా పెరిగి కిలోకు రూ.2.57 లక్షలుగా నమోదైంది. గతవారం బంగారం ధర ఒక దశలో రూ.1.50 లక్షల దిగువకు చేరిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండికి డిమాండ్ పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,323 డాలర్లకు చేరగా, స్పాట్ వెండి ఔన్సు ధర 70.38 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గతవారం ఒక దశలో బంగారం ధర 4,000 డాలర్ల దిగువకు పడిపోయింది. ఇక కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,53,258 వద్ద, వెండి ఫ్యూచర్స్ ధర రూ.2,52,383 వద్ద కొనసాగుతున్నాయి.



## భారత్‌లో టెస్లా డెలివరీలు ప్రారంభం

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా భారత్‌లో తాజాగా ప్రవేశపెట్టిన మోడల్ వైఎల్ డెలివరీలను ప్రారంభించింది. 6–సీటర్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీగా అందుబాటులోకి వచ్చిన ఈ వాహనం ప్రారంభ ధర రూ.61.99 లక్షలు (ఎక్స్–షోరూమ్)గా నిర్ణయించారు. సాధారణ మోడల్‌తో పోలిస్తే విశాలమైన క్యాబిన్‌ను కలిగి ఉన్న ఈ వాహనం 2+2+2 సీట్ల అమరికతో రూపొందించబడింది. ఇందులో 16 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థతో పాటు, రెండో వరుస ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా 8 అంగుళాల టచ్‌స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అదనంగా హీటెడ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, రెండో వరుస హీటెడ్ సీట్లు, హీటెడ్ స్టీరింగ్ వీల్, 19 స్పీకర్లతో కూడిన ప్రీమియం సౌండ్ సిస్టమ్ వంటి ఆధునిక ఫీచర్లను టెస్లా అందించింది. మోడల్ వైఎల్ డ్యూయల్–మోటార్ ఆల్ వీల్ డ్రైవ్ కాన్ఫిగరేషన్‌లో లభిస్తోంది. ఈ వాహనం కేవలం 5 సెకన్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని కంపెనీ వెల్లడించింది. పూర్తి ఛార్జ్‌తో 681 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని పేర్కొంది. అలాగే, 250 కిలోవాట్ల ఫాస్ట్ ఛార్జర్ సాయంతో కేవలం 15 నిమిషాల్లో 288 కి.మీ. వరకు ప్రయాణించగల సామర్థ్యాన్ని పొందవచ్చని టెస్లా తెలిపింది.



# ‘వారణాసి’ క్లైమాక్స్‌కు భారీ ఏర్పాట్లు

## మహేష్ - రాజమౌళి చిత్రంలో గ్రాండ్ యాక్షన్ ఎపిసోడ్!

సూపర్ స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం *‘వారణాసి’*పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్ర బృందం క్లైమాక్స్ చిత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నారని, అందులోనే కీలక పోరాట సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా మహేష్ బాబు అభిమానులను ఆకట్టుకునేలా ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక కథలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా జోనస్ ‘మందాకిని’ పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతుండగా, మహేష్ బాబు ‘రుద్ర’ పాత్రతో పాటు మరో కీలక పాత్రలోనూ నటిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశాలపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత కేఎల్ నారాయణ నిర్మిస్తుండగా, ఎస్ ఎస్ కార్తికేయా నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. సంగీతాన్ని ఎం ఎం కీరవాణి అందిస్తుండగా, కథను వీ విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. సంభాషణలను దేవ కట్ల రాస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో, ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పలు భారతీయ భాషల్లో విడుదల చేయాలని చిత్ర బృందం ప్రణాళికలు రూపొందిస్తోంది. అయితే చిత్రానికి సంబంధించిన కథ, పాత్రలు, బడ్జెట్ వంటి వివరాలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ‘సుభాష్’గా ఆర్యన్ శ్యామ్



భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్మరణీయ స్థానం సంపాదించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత కథ ఆధారంగా ఓ ప్రతిష్టాత్మక బయోపిక్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ (జెమిని ఫిల్మ్ సర్క్యూట్) నిర్మిస్తున్న ఈ చిత్రానికి ‘సుభాష్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో నేతాజీ పాత్రను యువ నటుడు ఆర్యన్ శ్యామ్ పోషించనుండగా, దర్శకుడు ఆనంద్ వి. ప్రసాద్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. సుభాష్ చంద్రబోస్ అసాధారణ జీవిత ప్రయాణం, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్ర, దేశభక్తి భావజాలం, నాయకత్వ లక్షణాలను ఈ చిత్రంలో ఆవిష్కరించను న్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన పోరాట స్ఫూర్తి, దేశ చరిత్రపై చూపిన ప్రభావం వంటి అంశాలను విస్తృత పరిశోధనల ఆధారంగా తెరపైకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.





# ‘డ్రాగన్’లో కృతి సనన్ ఎంట్రీ?

యంగ్ టైగర్ జూనియర్ఎ న్టీ రామారావు జూనియర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘డ్రాగన్’పై తాజాగా ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో ఇప్పటికే పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతుండగా, తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కథకు సంబంధించిన ప్రధాన పాత్రలను పరిచయం చేసిన ప్రశాంత్ నీల్, అసలు కథలోని కీలక సంఘర్షణను మాత్రం రహస్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఆ ప్రధాన కథా ట్రాక్‌లోనే కృతి సనన్ పాత్ర ఉండొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమాలు డార్క్ టోన్, బ్లాక్ అండ్ గ్రే షేడ్ విజువల్స్‌తో ప్రత్యేక గుర్తింపు పొందుతాయి. అయితే ‘డ్రాగన్’లోని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను పూర్తిగా కలర్‌ఫుల్ విజువల్స్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈ భాగంలో ప్రశాంత్ నీల్ శైలికి భిన్నమైన విజువల్ ట్రీట్ కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్Arts సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు.




# సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకున్నా!

టాలీవుడ్ నటి నివేదా పేత్‌రాజ్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. ‘అలా వైకుంఠపురములో’, ‘బ్రోచేవారెవరురా’, ‘రెడ్’, ‘పాగల్’ వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన ఆమె, కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల విడుదలైన ‘సింగ్ గీతం’ సినిమా సక్సెస్ మీట్‌లో పాల్గొన్న నివేదా పేతురాజ్, తన కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలాన్ని గుర్తుచేసుకున్నారు. 2023లో తాను సినిమాలకు పూర్తిగా గుడ్‌బై చెప్పాలనే నిర్ణయానికి వచ్చానని, ఆ సమయంలో తన ప్రణాళికలు అనుకున్నట్లుగా సాగలేదని తెలిపారు. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత ‘సింగ్ గీతం’తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మరో అవకాశం ఇచ్చిన నాగ్ అశ్విన్ వల్లే తాను మళ్లీ సినిమాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. “నాగ్ అశ్విన్ నాకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఆయన ప్రోత్సాహం లేకపోయి ఉంటే నేను ఈరోజు ఇక్కడ ఉండేదాన్నో కాదో తెలియదు” అంటూ భావోద్వేగంగా స్పందించారు. కాగా, ఇటీవల విడుదలైన ‘సింగ్ గీతం’ చిత్రానికి ప్రముఖ దర్శకుడు సంగీతం శ్రీనివాస్‌రావ్ దర్శకత్వం వహించగా, నాగ్ అశ్వన్ నిర్మాణ బాధ్యతలు నిర్వహించారు. ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది.

# రాజ్ నిడిమోరు మూవీలో సల్మాన్ ఖాన్?



‘ది ఫ్యామిలీ మ్యాన్’, ‘ఫర్జీ’ వంటి విజయవంతమైన వెబ్ సిరీస్‌లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాజ్ నిడిమోరు ఇప్పుడు ఓ భారీ బాలీవుడ్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన రాబోయే ప్రాజెక్టుల గురించి ఆసక్తికర వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ పనులు కొనసాగుతున్నాయని, అది ప్రీ – ప్రొడక్షన్ దశలో ఉందని రాజ్ తెలిపారు. అలాగే మరో వెబ్ సిరీస్ అభివృద్ధి దశలో ఉండగా, తమ హిందీ సినిమా నిర్మాణం కూడా త్వరలో ప్రారంభం కానుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను ఆకట్టు కునేలా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ సల్‌మాన్ ఖాన్ హీరోగా నటించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.



# ‘ధ్రువ నక్షత్రం’పై కీలక తీర్పు..

## గౌతమ్ మీనన్‌కు మరో అవకాశం దక్కుతుందా?

చియాన్ విక్రమ్ హీరోగా, దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తెరకెక్కించిన ‘ధ్రువ నక్షత్రం’ చిత్రం విడుదల సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. నిర్మాతలు, పెట్టుబడిదారులు, ఫైనాన్షియర్ల మధ్య నెలకొన్న ఆర్థిక వివాదాల కారణంగా ఈ సినిమా చాలా కాలంగా విడుదలకు నోచుకోలేదు. ఇప్పటికే పలు దఫాల విచారణల అనంతరం, జూన్ 15లోపు సినిమాను విడుదల చేస్తానని గౌతమ్ మీనన్ మద్రాస్ హైకోర్టుకు హామీ ఇచ్చారు. ఆ మేరకు కోర్టు ఆయనకు గడువు కూడా మంజూరు చేసింది. అయితే నిర్ణీత సమయంలో సినిమాను విడుదల చేయడంలో ఆయన విఫలమవడంతో, తాజాగా మరో నెల రోజుల గడువు కోరుతూ జూలై 15 వరకు సమయం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై కోర్టు నిర్ణయం వెలువరించనుంది. ఇదే సమయంలో, సినిమా ఫైనాన్షియర్లు కే. ప్రేమ్ కుమార్, కే. పుణ్యమూర్తి దాఖలు చేసిన పిటిషన్ కూడా విచారణకు రానుంది. తమ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, వాటాల పంపకంపై స్పష్టత లేకపోవడంతో న్యాయం చేయాలని వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో నేటి విచారణ *‘ధ్రువ నక్షత్రం’* భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా మారింది. కోర్టు గౌతమ్ మీనన్‌కు మరింత గడువు ఇస్తుందా? లేక ఫైనాన్షియర్ల వాదనలకు అనుకూలంగా తీర్పు వెలువడుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. **RNI NO: TELTEL/2023/87657**